www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
శుక్రవారం 20, జూన్, 2025 | పేజీలు :12



# బనకచర్ల నిర్మాణంలో తప్పేంటి..?

- రెండు రాష్ట్రాల మధ్య మళ్లీ జలవివాదం
- బనకచర్ల నిర్మాణంపై తెలంగాణ అభ్యంతరం
- అనుమతులు ఇవ్వొద్దని కేంద్రానికి లేఖలు
- వరద నీటిపై నిర్మాస్తున్నామంటున్న ఏపీ
- రూ.80 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపు
- వృథా జలాలపై ప్రాజెక్ట్ నిర్మిస్తే తప్పేంటని కామెంట్స్

**టీపీఎన్, అమరావతి |**

బనకచర్ల ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు రేపుతోంది. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం గట్టిగా స్పందిస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కేంద్రానికి ఇప్పటికే అనేక లేఖలు పంపినట్లు మంత్రి తెలిపారు. ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

### బనకచర్ల ప్రాజెక్టుపై రూ.80 వేల కోట్ల బడ్జెట్..!

బనకచర్ల ప్రాజెక్టును రూ.80,000 కోట్ల వ్యయంతో నిర్మించాలన్నది ఏపీ ప్రణాళిక. పోలవరం ప్రాజెక్టుకు అనుబంధంగా ఉండే ఈ లింక్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతుల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకుంది. గతంలో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టును సమర్థించారని పేర్కొంటూ, ఆయన "రాయలసీమను రత్నాలసీమ చేస్తానంటే నేను ఎందుకు వద్దంటాను..?" అన్న వ్యాఖ్యలను ప్రస్తావించింది ఏపీ. అంతేకాదు, జగన్ కూడా అప్పట్లో కేసీఆర్ ఉదారతపై చేసిన వ్యాఖ్యలను మంత్రి నిమ్మల తన ప్రెజెంటేషన్ లో పేర్కొన్నారు. దీంతో, బీఆర్ఎస్ ఇప్పుడు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడటం లేదని ఆయనే ప్రశ్నించారు.

### తెలంగాణలో ప్రతిపక్షాల స్పందన..!

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. బనకచర్లను గోదావరి జలాల్లో పోతిరెడ్డిపాడు లాంటి ప్రాజెక్టుగా అభివర్ణిస్తూ, ఇది రాష్ట్ర హక్కులను హరించే ప్రయత్నంగా ముద్ర వేస్తోంది. మాజీ నీటి పారుదలశాఖా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. ఇది తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించవచ్చని హెచ్చరిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాత్రం ఇరు రాష్ట్ర ముఖ్యమంత్రులే ప్రత్యక్షంగా చర్చలు జరపాలని, కేంద్రం పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు.

> ### వరదనీటి వినియోగమే లక్ష్యమని ఏపీ వాదన..!
>
> ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి వచ్చిన అధికారిక ప్రెజెంటేషన్ ప్రకారం.. బనకచర్లకు తెలంగాణతో సంబంధమే లేదని వాదిస్తున్నారు. "మేమేమైనా మీ ప్రాజెక్టులు ఆపామా?" అంటూ స్పష్టంగా ప్రశ్నిస్తున్న ఏపీ.. దిగువ రాష్ట్రంలో ప్రాజెక్టు నిర్మిస్తే.. ఎగువన ఉన్న తెలంగాణకు ఏంటి అభ్యంతరమని నిలదీస్తోంది. గోదావరి నదిలో ఏటా సముద్రంలో కలిసిపోతున్న 3,000 టీఎంసీల వరద నీటిని రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తాగు, సాగునీటి అవసరాల కోసం మళ్లించాలన్నదే తమ లక్ష్యమని చెప్పింది. అనంతపురం లాంటి తక్కువ వర్షపాత ప్రాంతానికి నీరు అందించడం తప్పనిసరి చర్యగా చూడాలని, అది తప్పు కాదని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

### అనుమతులు అవసరమా..? నిపుణులు ఏమంటున్నారు..?

ఈ అంశంపై నిపుణుల అభిప్రాయాలు విభిన్నంగా ఉన్నాయి. గోదావరిపై తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న నాలుగు డీపీఆర్లు ఉన్నప్పటికీ, ఏపీ ఇరిగేషన్ నిపుణులు మాత్రం బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర అనుమతులు అవసరం లేదని అంటున్నారు. ఇది 1980లో రూపొందించిన నదుల అనుసంధాన ప్రణాళికలో భాగమని, మోదీ సైతం నదుల అనుసంధానానికి మద్దతు పలికినట్లు గుర్తుచేస్తున్నారు. 1980 ట్రిబ్యునల్ తీర్పులు మరియు 2014 పునర్వ్యవస్థీకరణ చట్టానికి ఈ ప్రాజెక్టు వ్యతిరేకంగా లేదని, ఎందుకంటే ఈ ప్రాజెక్టు పూర్తిగా వరద నీటి వినియోగంపైనే ఆధారపడిందని అంటున్నారు. 1986లో వచ్చిన భారీ వరదలతో కోటి మందికి పైగా ముంపునకు గురయ్యారు. అలాంటి ముంపుల నివారణ కోసమే ఇదన్నది వారి వాదన.

### ఈ వివాదానికి ముగింపు ఏంటి..?

ఇప్పుడు ఈ వివాదం ఎటు పోతుందన్నదే కీలక ప్రశ్న. నీటి భాగస్వామ్యంలో స్పష్టత, పారదర్శకత అవసరం. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యక్షంగా భేటీ కావడం, కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవడం, ఒక స్థిరమైన పరిష్కారానికి దారితీసే మార్గాలు కావాలి. లేదంటే ఈ బనకచర్ల వివాదం కోర్టుల బాట పట్టే ప్రమాదం ఉంది.



# హ్యాపీ నెస్ట్ ..అమరావతిలో అపార్ట్‌మెంట్.. వచ్చేస్తోంది

**టీపీఎన్, అమరావతి |**

హ్యాపీ నెస్ట్.. మిడిల్ క్లాస్ వాళ్ల కల.. అది ఇప్పుడు నెరవేరబోతోంది. ఆగిపోయింది, ఇక లేదు అనుకున్న హ్యాపీ నెస్ట్ ఇప్పుడు మళ్లీ ప్రాణం పోసుకుంది. ఒక సంవత్సరంలో ఆ ఫ్లాట్స్‌లోకి కొనుగోలుదారులు వెళ్లబోతున్నారు. రాజధాని అమరావతిలో నివసించాలనే వారి ఆశ తీరబోతోంది. 2018 నవంబర్ 1న ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పుడు మిక్స్‌డ్ రియాక్షన్స్ వచ్చాయి. అమరావతిలో అపార్ట్‌మెంట్ కట్టి అమ్మడమేంటి..? సీఆర్డీయే రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తుందా..? అని ప్రశ్నించిన వారున్నారు. కాని అమరావతిలో భూములిచ్చిన రైతులకు, కార్పొరేట్ కంపెనీలకు తప్ప వేరేవారికి అవకాశం ఎప్పుడో వస్తుందని.. అప్పటికి రేట్లు భారీగా ఉంటాయని.. అలా కాకుండా ఇప్పుడు ఒక అపార్ట్‌మెంట్లో అక్కడ ఫ్లాట్ కొనుక్కునే అవకాశం వస్తే ఎవరూ వదులుకోరని చెప్పారు. అలాగే దానికి నవంబర్ 9న బుకింగ్స్ ఓపెన్ చేస్తే క్షణాల్లో హాట్ కేక్సులాగా అమ్ముడుపోయాయి. మరోసారి డిసెంబర్ 10, నవంబర్ 18నే మిగతావాటికి ఓపెన్ చేస్తే అప్పుడు కూడా అలాగే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆ రెస్పాన్స్ చూసి అందరూ ఆశ్చర్యపోయారు. రాజధాని అమరావతిపై జనం ఆశలు, అంచనాలు ఎలా ఉన్నాయో ఆ స్పందనే చెబుతుందని నాడు కామెంట్లు వచ్చాయి. 1200 ఫ్లాట్లకు గాను 1185 అమ్ముడుపోయాయి. మిగతా 15 కూడా సేల్‌కి పెట్టకపోవడం వలన ఆగాయి అంతే. 2019లో ప్రభుత్వం మారడం.. వైసీపీ అధికారంలోకి రావడం.. నాటి సీఎం జగన్ అమరావతిని ఆపేయాలనే చూడటం అందరికీ తెలిసిందే. మూడు రాజధానుల పేరుతో అమరావతిని శాసనరాజధాని అంటూనే.. అక్కడ జరిగే పనులన్నిటిని ఆపేయడం.. ప్రపంచ బ్యాంకుకు సైతం నెగెటివ్ రిపోర్టులు ఇవ్వడం వంటివి చేశారు. ఇక రాజధాని అమరావతి లేదు అనే పరిస్థితి వచ్చింది. అంతే కాకుండా ఎవరైనా కేన్సిల్ చేసుకుంటే హ్యాపీ నెస్ట్ కొనుగోలుదారులకు ఇచ్చిన అమౌంట్ తిరిగి ఇస్తామని ప్రకటించింది. దీంతో 185 మంది ఆ పని చేసి అమౌంట్ తీసుకున్నారు. కాని మిగతా 1000 మంది మాత్రం పరిస్థితులు మారతాయి.. ప్రభుత్వం కూడా మారిపోతుందని నమ్మి.. వాటిని అలాగే ఉంచుకున్నారు. ఇప్పటివరకు నిరీక్షించారు. వారు కోరుకున్నట్లు ప్రభుత్వం మారింది. మళ్లీ చంద్రబాబునాయుడు సీఎం అయ్యారు. రాజధాని పనులు వేగవంతం అయ్యాయి. వర్షన్ 2.0లో మరింత ఆధునికంగా రాజధాని తయారవుతుందని చెబుతున్నారు. మంత్రి నారాయణ ప్రత్యేకమైన ఫోకస్‌తో ఈ పని మీదే తిరుగుతూ .. అధికారులను కూడా ఫుల్లీ ఎంగేజ్ చేసేశారు. టెండర్లు పిలుస్తూ.. వాటిని ఫైనల్ చేసి.. వాటికి కావాల్సిన బడ్జెట్లు తెచ్చుకుంటూ .. పనులు ప్రారంభించారు. అందులో భాగంగా హ్యాపీ నెస్ట్ కూడా ప్రారంభమైంది. అయితే కాంట్రాక్టర్ ఎన్‌సీసీ కంపెనీ. అప్పుడు ఫైనల్ అయిన రేట్లతో ఏడేళ్ల తర్వాత ఎవరూ చేయలేరు. అందుకే రేట్లు రివైజ్ చేసి ఇచ్చారు. దీనిపై వైసీపీ, దాని మీడియా కూడా "రేట్లు పెంచి.. భారం ప్రజలపై వేస్తారా..?" అంటూ ప్రచారం మొదలెట్టారు. అసలు ఆగింది.. ఈ పరిస్థితికి తెచ్చింది వారే.. మళ్లీ ఈ క్యాంపెయిన్ ఏంటని హ్యాపీనెస్ట్ కొనుగోలుదారులు మండిపడ్డారు. పనులు అయితే ప్రారంభమయ్యాయి.. మరో ఏడాదిలో ఫ్లాట్లు అప్పచెప్పే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. మరో 200 ఫ్లాట్లు అమ్మకానికి ఉన్నా.. వాటిని కొంత కాలం ఆగి ఆన్‌లైన్ బుకింగ్‌లో పెడతామంటున్నారు. అయితే ఈసారి రేటు పెంచే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. ఏమైనా అమరావతిలో అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ అనే కల అయితే 1200 మందికి నెరవేరబోతోంది.



# జగన్ ఏమీ మారలేదు..!

- రపా రపా నరుకుతామన్న పోస్టర్
- మంచిదేగా అంటూ జగన్ వ్యాఖ్య

**టీపీఎన్, అమరావతి |**

ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా రెంటపాళ్ళ పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలు అత్యంత వివాదాస్పదంగా మారాయి. బెట్టింగ్‌లతో అప్పుల పాలైన వ్యక్తి మరణిస్తే జగన్ పరామర్శించి.. విగ్రహాన్ని కూడా ఆవిష్కరించడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఇక కమ్మ సామాజిక వర్గానికి న్యాయం చేసే విధంగా అక్కడ జగన్ మాట్లాడటం సైతం విస్మయానికి గురి చేసింది. జగన్ పర్యటన సందర్భంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం వివాదాస్పదంగా మారిన అంశం. వారికి టీడీపీ నేతలు ఆర్థిక సాయం చేశారు. జగన్ పర్యటనలో వైసీపీ కార్యకర్తలు, అభిమానులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. పోలీసులను ఎదిరించా అంటూ అమ్మాయిలు కూడా బైక్ రైడ్ చేస్తూ వీడియోలు చేశారు. కొందరైతే.. మరో అడుగు ముందుకు వేసి.. సినిమా డైలాగులను పోస్టర్లుగా వేశారు. ఇదే ఇప్పుడు అత్యంత వివాదంగా మారింది.

వైఎస్ జగన్ పల్నాడు టూర్‌లో రపా రపా డైలాగ్‌తో కూడిన ప్లకార్డ్ కలకలం రేపింది. 2029లో అధికారంలోకి వచ్చిన వెంటనే గంగమ్మ తల్లి జాతరలో వేట తలలు నరికినట్లు రపా రపా నరుకుతాం అంటూ రవితేజ అనే వైసీపీ అభిమాని ప్లకార్డు ప్రదర్శించాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై టీడీపీ నేతలు ఘాటుగా స్పందించారు. ఎవర్ని నరుకుతారు.. ఎందుకు నరుకుతారు అంటూ ఎదురు ప్రశ్నించారు. అదే సమయంలో సైకో బ్యాచ్ అంతా జగన్ వెంటే ఉన్నారంటూ ఏకంగా హోమ్ మంత్రి అనిత కూడా వ్యాఖ్యానించారు. ఇదే పర్యటనలో రాజారెడ్డి రాజ్యాంగం పల్నాడు నుంచే మొదలు అంటూ మరో ప్లకార్డు కూడా వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టు నేపథ్యంలో తాడేపల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు వైఎస్ జగన్. చెవిరెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. ఒక ప్రతిపక్ష నేతగా పార్టీ కార్యకర్తలను పరామర్శించేందుకు వెళితే.. టీడీపీకి భయం ఎందుకని ప్రశ్నించారు. పోలీసులు బారికేడ్లు ఎందుకు పెట్టారన్నారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని.. తన చుట్టూ ఉన్నవాళ్లను భయపెట్టి అరెస్టు చేస్తున్నారన్నారు. సాక్షి ఆస్తులు ధ్వంసం చేసేందుకు కుట్ర చేశారన్నారు. ఇదే సాంప్రదాయం రేపు కొనసాగితే... ఎవరైనా బతుకుతారా అని వార్నింగ్ కూడా ఇచ్చారు.

ఇక రపా రపా ప్లకార్డుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు జగన్ స్పందించారు. ప్లకార్డు పట్టుకున్న కార్యకర్త టీడీపీకి చెందిన వ్యక్తి అని.. టీడీపీ సానుభూతిపరుడు కూడా చంద్రబాబు మీద కోపంతో పార్టీ మారాడేమో అని ఎద్దేవా చేశారు. అయినా పుష్ప సినిమా డైలాగ్ పెట్టినా కూడా తప్పేనా అని ఎదురు ప్రశ్నించారు తప్ప.. ఇది తప్పు అని ఖండించలేదు. నరుకుతాం అనే మాటను జగన్ ఎక్కడా తప్పుపట్టలేదు. పైగా టీడీపీ వాళ్లని పొట్టేళ్లు తల నరికినట్టు రప్పా రప్పా నరుకుతారు, మంచిదేగా అది అని సమర్థించారు. దీంతో అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు తప్పవని ముందే జగన్ చెబుతున్నట్లుంది అనేది విశ్లేషకుల మాట. ఉన్మాదులని ఖండించాల్సింది పోయి, ప్రోత్సహిస్తున్నారా అని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. నరుకుతాం.. నా కొడకల్లారా... అంతు చూస్తాం.. అనేవి కూడా సినిమా డైలాగులా అని నిలదీస్తున్నారు. మొత్తానికి రపా రపా డైలాగు ఇప్పుడు టీడీపీ, వైసీపీ నేతల మధ్య పెద్ద దుమారమే రేపుతోంది.







# టోనీ బ్లెయిర్‌తో మంత్రి లోకేష్ సమావేశం..!

**టీపీఎన్ న్యూఢిల్లీ :**
బ్రిటిష్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్‌తో ఏపీ విద్యాశాఖ, ఐటీ మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. ఈ సమావేశం రాష్ట్ర ప్రభుత్వం మరియు టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (TBI) మధ్య వివిధ సహకారాల గురించి చర్చించడానికి జరిగింది. రాష్ట్రం యొక్క ఏఐ సమైక్యత, విద్యా సంస్కరణలు మరియు నైపుణ్య శిక్షణ వైపు ముందడుగుగా గుర్తించబడింది.

గ్లోబల్ థింక్ ట్యాంక్ అధిపతి కూడా అయిన టోనీ బ్లెయిర్, ఆంధ్రప్రదేశ్‌తో సహకారాన్ని మరింత గాఢం చేయడానికి అంగీకరించారు, ముఖ్యంగా ప్రభుత్వ సేవలు మరియు విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధస్సు సాధనాల వినియోగంలో. నాయకులు 2024 డిసెంబర్‌లో ఏపీ విద్యాశాఖ మరియు TBI మధ్య ఒప్పందం కుదిరిన మెమోరాండం ఫలితాలను సమీక్షించారు, ఇది విద్యను ఆధునీకరించడం మరియు యువతకు సాంకేతికత ద్వారా ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఇప్పటికే కొనసాగుతున్న భాగస్వామ్యంలో భాగంగా, TBI విజయవాడలో ఒక ఎంబెడెడ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ప్రస్తుతం రెండు కీలక కార్యక్రమాలపై పనిచేస్తోంది: ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్యా సంస్కరణలు మరియు గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (GIGG) స్థాపన. చర్చల్లో రాష్ట్రం యొక్క విస్తృత నైపుణ్య అభివృద్ధి అజెండాకు సాంకేతిక మద్దతు, నైపుణ్య జనాభా గణన మరియు ఏపీ యువతకు అంతర్జాతీయ ఉపాధి మార్గాలను విస్తరించడం కూడా చేర్చబడ్డాయి. మంత్రి లోకేష్ మరియు టోనీ బ్లెయిర్ ఈ కార్యక్రమాల ప్రస్తుత పురోగతిని సమీక్షించి, సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి మార్గాలను చర్చించారు.

ఒక ప్రధాన పరిణామంలో, లోకేష్ టోనీ బ్లెయిర్‌ను గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అడ్వైజరీ బోర్డులో చేరమని ఆహ్వానించారు. మాజీ యూకే ప్రధానమంత్రి, విశాఖపట్నంలో ఆగస్టులో జరగనున్న రాష్ట్ర విద్యా మంత్రుల కాన్క్లేవ్‌లో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ కీలక భాగస్వామిగా ఉంటుందని అంగీకరించారు. విద్యా కార్యదర్శి కోన శశిధర్ మరియు TBI ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో ఉన్నారు, ఇది ఆంధ్రప్రదేశ్ యొక్క పాలన మరియు విద్యా పరివర్తన అజెండాలో ఒక వ్యూహాత్మక మైలురాయిగా గుర్తించబడుతోంది.



# చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం..

## ఏపీని అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం: పవన్ కల్యాణ్

- **ఏడాది సుపరిపాలనపై ప్రగతి నివేదిక విడుదల చేసిన డిప్యూటీ సీఎం**
- **అనుభవం ఉన్న నాయకుడి పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోందని వెల్లడి**



**టీపీఎన్ అమరావతి:**
'రాజకీయాల్లో, ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి. అలా నిరంతరం పరితపించే నేను గత సంవత్సర కాలంలో చేపట్టిన శాఖల ద్వారా చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలందరి ముందు ఉంచడం నా నైతిక బాధ్యత. అధికార బాధ్యతలు స్వీకరించి సంవత్సరం అయిన సందర్భంగా ఈరోజు మీ ముందుకు తీసుకొస్తున్నాను..' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా; పర్యావరణ, అటవీ, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు చేపట్టి గురువారంతో సంవత్సరం పూర్తైన సందర్భంగా సమగ్ర అభివృద్ధి నివేదిక విడుదల చేశారు. దీంతో పాటు పవన్‌కల్యాణ్ ఓ లేఖను విడుదల చేశారు. "ప్రియమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు... గత సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయానికి అండగా నిలబడి, రాష్ట్రాన్ని బానిస సంకెళ్లు నుండి విముక్తి చేసిన ప్రతి ఒక్కరికీ మనస్పూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.." అని ఆయన పేర్కొన్నారు.

2019 నుండి 2024 వరకు ఐదేళ్ల కాలంలో రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయింది, అభివృద్ధికి దూరమైంది, శాంతి భద్రతలు క్షీణించాయి, యువత భవిష్యత్తుపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి, మహిళలకు రక్షణ కరువైం దని తెలిపారు. రాష్ట్ర రాజధాని నిర్మాణంలో ఒక్క ఇటుక కూడా కదలకుండా నిర్మానుష్యంగా మారిన సమయంలో రాష్ట్రాన్ని రక్షించేందుకు, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిపాలనను పునరుద్ధరించేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలో, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ప్రజల పక్షాన ఎల్లవేళలా నిలబడి పోరాడే మన సమిష్టి సహకారంతో ఎన్‌డీఏ కూటమి 164 అసెంబ్లీ సీట్లను గెలిచి 94% స్ట్రైక్ రేట్ తో చారిత్రాత్మక విజయం సాధించిందన్నారు. ఇంతటి గెలుపును అందించిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు, మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అహర్నిశలు కృషి చేస్తూ సంవత్సర కాలంలోనే గత ఐదేళ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపిస్తూ, ప్రజల్లోనే కాకుండా, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపడానికి కృషి చేశామన్నారు.

**సుపరిపాలనకు కేంద్ర సహకారం:**
రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సుపరిపాలనను చూసి నేడు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు అందిస్తుండటంతో రాష్ట్రం అన్ని రంగాల్లో సమిష్టి అభివృద్ధి సాధిస్తూ స్వర్ణాంధ్ర 2047 సాధించే దిశగా అడుగులు వేస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ: పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర నివేదికను ప్రజలందరూ నిశితంగా పరిశీలించి ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, మీరు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేయాలనే మా సంకల్పాన్ని గుర్తిస్తారని ఆశిస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు.

**గత ఐదేళ్ళలో నియంతృత్వ పాలన..:**
గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ఏడాదిగా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై పవన్ కల్యాణ్ ప్రగతి నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమి విజయానికి అండగా నిలబడిన ప్రతిఒక్కరికీ, అలానే రాష్ట్రాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసిన ప్రతిఒక్కరికీ పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

**పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపాం..:**
రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేవారిలో విశ్వాసం నింపామని అలానే కేంద్ర ప్రభుత్వం కూడా అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలుస్తోందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, దూరదృష్టి నాయకుని పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోందని అన్నారు. రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.



# అమరావతిలో ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందం పర్యటన..!

**టీపీఎన్, అమరావతి :**
ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందం అమరావతిలో పర్యటించింది. తొలుత బృంద సభ్యులు విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని అమరావతి నిర్మాణంలో అమలు చేయాల్సిన పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు, కార్మికుల ఆరోగ్య భద్రత తదితర అంశాలపై ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృంద సభ్యులకు సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ స్వాగతం పలికారు. అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ..అమరావతి నిర్మాణ కార్యకలాపాల్లో పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత, కార్మికులకు పనిప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను గురించి వివరించారు. అదేవిధంగా అమరావతిలో నివసిస్తున్న ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన గురించి తెలియజేశారు. లింగవివక్ష, బాలకార్మికులకు తావు లేకుండా రాజధాని అమరావతి నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. అలాగే గ్రీవెన్స్ రీఅడ్రెస్సల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రైతులు, రాజధాని ప్రాంత వాసుల సమస్యలను ఎప్పటికప్పుడు అర్జీల రూపంలో స్వీకరించి..వాటిని సత్వరమే పరిష్కరిస్తున్న విధానాన్ని వివరించారు.

కార్యక్రమంలో భాగంగా ఈ బృందంలోని సీనియర్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ బాయన వెంకటరావు..రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులో భాగంగా ఉన్న పర్యావరణ, సామాజిక వ్యవస్థల అసెస్‌మెంట్ ప్రక్రియపై సూచనలను వివరించారు. రీసెటిల్మెంట్ యాక్షన్ ప్లాన్, పాలసీల గురించి మాట్లాడారు. అనంతరం ఈ బృందంలోని సామాజిక రక్షణ కార్యకలాపాల సలహాదారు రంజన్ వర్మ, బాయన వెంకటరావులు..అమరావతి నిర్మాణ ప్రాజెక్టులో వరల్డ్ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ యొక్క బాధ్యతలను, పర్యావరణ, సామాజిక సంక్షేమ కార్యకలాపాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న వివిధ సంస్థలు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై చర్చించారు. గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రాజధాని ప్రాంతవాసులు, కార్మికులకు సంబంధించి ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారం గురించి వివరించారు.

అనంతరం బృందంలోని సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్ట్ జోసెఫ్, పర్యావరణ సంరక్షణ కార్యకలాపాల సలహాదారు దమన్‌జిత్ సింగ్ మిన్హాస్‌లు..రాజధాని అమరావతి నిర్మాణంలో పాలుపంచుకుంటున్న గుత్తేదారులు పాటించాల్సిన సామాజిక రక్షణ కార్యకలాపాలు, పర్యావరణ పరిరక్షణ, ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన సురక్షిత విధానం, కార్మికుల భద్రత తదితర అంశాల గురించి వివరించారు. బృందంలోని మహిళా ప్రతినిధి జయశర్మ..లైంగిక దాడి, హింస తదితర ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన గోప్యత, బాధితులకు అందించాల్సిన సహాయం



తదితర అంశాలను వివరించారు.

అనంతరం రాజధాని అమరావతి ప్రాంతంలో నిర్మాణ పనులు జరుగుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు, శాఖమూరు రిజర్వాయర్, ఎల్పీఎస్ జోన్ 2A ప్రాజెక్టు సైట్, కార్మికుల క్యాంపులను బృంద సభ్యులు, సీఆర్డీఏ, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. బృంద సభ్యులు ఆయా సైట్లలో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడారు. గుత్తేదారు సంస్థలు క్యాంపులలో అందుబాటులో ఉంచిన మౌలిక సదుపాయాలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



# నిరుపేదల బతుకుల్లో

## ఆశాదీపం ముఖ్యమంత్రి సహాయ నిధి..!

- **రూ.22.12 లక్షల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సుభాష్**

**టీపీఎన్, రామచంద్రపురం :**
అనారోగ్యంతో, ఆర్థిక భద్రత లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదల కుటుంబాలకు ఆసరాగా నిలిచి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో వివిధ కారణాలతో అనారోగ్యం పాలైన వారిని ఆదుకునేందుకు మంజూరైన రూ.22.12 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 20 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ సమాజంలోని పేదలు, ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అనారోగ్యం పాలైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి తక్షణం నిధులు మంజూరు చేయించి, మంచి వైద్య సహాయం అందించి వారు త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నవ్యాంధ్ర రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకుగా సీఎం చంద్రబాబు నాయుడు అండగా ఉండి ఆదుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు కోటి రూపాయలుకు పైగా లబ్ధిదారులకు చెక్కులు అందించామని వెల్లడించారు. ప్రభుత్వ పరంగానే కాకుండా, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా,అలాగే వ్యక్తిగతంగా కష్టాల్లో,బాధల్లో, అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి అండగా ఉండి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి సుభాష్‌కు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.




## ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు
# భారీ ఎదురుదెబ్బ


### పీఎల్ టెండర్ ప్రక్రియను అపేయాలని హైకోర్టు ఉత్తర్వులు

**టీపీఎన్, అమరావతి :**

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) కోసం టెండర్ ప్రక్రియను ఆపివేస్తూ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో పెద్ద వివాదంలో చిక్కుకుంది. ఈ వివాదం ఆరు ఇప్పటికే ఉన్న ఫ్రాంచైజీల నుండి చట్టపరమైన సవాలు ఎదుర్కొనడంతో ఉద్భవించింది. ఇటీవల జరిగిన నాయకత్వ మార్పుల తర్వాత, కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ద్వారా కొత్తగా ఎన్నికైన విజయవాడ ఎంపీ ఏసీఏ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు—ఇది క్రికెట్ వర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. అధ్యక్షుడు తన చార్టర్డ్ అకౌంటెంట్‌ను ట్రెజరర్‌గా నియమించగా, సానా సతీష్ కార్యదర్శిగా, భీమవరం మరియు విశాఖపట్టణం ఎమ్మెల్యేలతో సంబంధం ఉన్న ప్రశాంత్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇది క్రికెట్ పరిపాలనలో రాజకీయ జోక్యం పెరుగుతోందనే తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది.

ఫ్రాంచైజీలతో 18 సంవత్సరాల ఒప్పందం ఉన్నప్పటికీ, గత సంవత్సరం జనరల్ బాడీ మరియు గవర్నింగ్ కౌన్సిల్ ద్వారా ఆమోదించబడినప్పటికీ, ఏసీఏ ఏపీఎల్ కోసం కొత్త టెండర్లను ఆహ్వానించింది. దీనికి ప్రతిస్పందనగా, లీగ్‌ను నిలబెట్టడంలో మరియు ఐపీఎల్ స్థాయి ప్రతిభను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిన ఫ్రాంచైజీ యజమానులు—మొత్తం రూ.30 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినవారు—జూన్ 5న హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు జూన్ 6న టెండర్ ప్రక్రియపై స్టే జారీ చేసింది మరియు జూన్ 19న మరో 10 రోజుల పాటు దానిని పొడిగించింది.


లీగ్‌ను నిలబెట్టిన మరియు ఐపీఎల్ స్థాయి ప్రతిభను పెంపొందించిన ఫ్రాంచైజీలు ఇప్పుడు అనిశ్చితిలో ఉన్నాయి. ఈ చర్య ప్రజల ఆగ్రహాన్ని రేకెత్తించింది, చాలామంది దీర్ఘకాల పెట్టుబడిదారులను పక్కనపెట్టడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆంధ్ర క్రికెట్ విశ్వసనీయతను కాపాడటానికి అభిమానులు మరియు ఇతర పాత్రధారులు పారదర్శకత, న్యాయం మరియు జవాబుదారీతనం కోరుతున్నారు.




# విశాఖలో యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలన!

టీపీఎన్, విశాఖపట్నం : స్థానిక గీతం యూనివర్సిటీ క్రికెట్ మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ బీ శ్రీనివాసరావు పరిశీలించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21 విశాఖపట్నం ప్రధాన వేదికగా జరుగుతున్న సంగతి తెలిసిందే. పాఠశాల విద్యశాఖకు సంబంధించి గీతం యూనివర్సిటీ క్రికెట్ మైదానం కేటాయించారని, విద్యాశాఖ నుండి దాదాపు 10 వేల మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కేవీ శ్రీనివాసులు రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమకుమార్, సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





## రాజధానిలో మొక్కలకు
# డ్రోన్లతో వర్మీవాష్!

**టీపీఎన్, అమరావతి :**

వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో రాజధాని అమరావతిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) మొక్కలకు పోషకాలు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా అమరావతికి ప్రధాన అనుసంధాన రహదారి(సీడ్‌యాక్సెస్ రోడ్డు)పై ఉన్న పూల మొక్కలకు అధికారులు డ్రోన్ల ద్వారా వర్మీవాష్ చేస్తున్నారు. ఆర్గానిక్ పోషకాలను మొక్కలకు అందించడానికి ఈ వర్మీవాష్ తోడ్పడుతుంది. ముఖ్యంగా డ్రోన్ల ద్వారా పిచికారీ చేయటం ద్వారా మొక్కపై నుంచి కింది భాగం వరకు పోషకాలు అందించవచ్చు. సుమారు 10 కి.మీ మేర వర్మీవాష్‌ను అధికారులు పూర్తిచేశారు. త్వరలో ఎన్95 రోడ్డుపై కూడా వర్మీవాష్ ప్రారంభిస్తారు. రహదారి మధ్యన, రహదారికి ఇరువైపులా వర్మీవాష్ చేయటం ద్వారా పూలు అందంగా పూయటంతో పాటు అమరావతి రహదార్లు ఆకర్షణీయంగా ఉంటాయి.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని
# సీబీసీ ఆధ్వర్యంలో ప్రీఈవెంట్!

**టీపీఎన్, విశాఖపట్నం :**

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), విశాఖపట్నం ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో 2025 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాలతాంబ విద్యానికేతన్లో ప్రీఈవెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జూన్ 21, 2025న విశాఖపట్నంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సారథ్యంలో నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమానికి ఇది ముందస్తు ప్రారంభంగా నిలిచింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ రాజేందర్ చౌదరి, ఐఐఎస్, అదనపు డైరెక్టర్ జనరల్ ఆంధ్ర ప్రదేశ్ (రీజియన్), ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది భారత దేశం నుండి ప్రపంచానికి అందించిన విలువైన సంపద అని ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకు పునాది వేసే ప్రక్రియ అని అన్నారు. యువతలో ఆరోగ్యవంతమైన జీవనశైలికి, అభివృద్ధికి యోగా ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో "సమతుల్య జీవనం కోసం యోగా" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రొఫెషనల్ యోగా శిక్షకుల నేతృత్వంలో ప్రత్యక్ష యోగా ప్రదర్శనని నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులకు సీబీసీ తరఫున టీషర్టులు, యోగా సంబంధిత పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సమగ్ర ఆరోగ్యం, శాంతి, సామాజిక ఐక్యతకు యోగా దోహదపడుతుందన్న విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, యువతను యోగాభ్యాసం వైపు ప్రోత్సహించడంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సంకల్పాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. శ్రీ శ్రీరామ మూర్తి కందాళ, ఐఐఎస్, ఎఫ్పీవో-సీబీసీ విశాఖపట్నం, శ్రీ సునీల్ మహంతి (కరస్పాండెంట్), డా. జీపీఆర్ కృష్ణ (జనరల్ మేనేజర్, మాలతాంబ విద్యానికేతన్), విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# అందరిలో ఉత్కంఠ

- నేడు కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం...
- ఆరు మాసాల అనంతరం సర్వసభ్య సమావేశం...
- వైసీపీ కార్పొరేటర్లకు రక్షణ కల్పించి....
- సభను సజావుగా నిర్వహించేలా చూడాలని కోర్టు ఆదేశం...
- సమావేశంలోకి బయటి వారిని రానివ్వకుండా చూడాలని వైసీపీ కార్పొరేటర్ల వినతి....
- కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్న ఇరు పార్టీల నేతలు...

**టీపీఎన్, కడప :**

కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఆరు మాసాల అనంతరం జరగనుంది. సర్వసభ్య సమావేశం హాలులో వేదికపై మేయర్ తో పాటు ఎమ్మెల్యే మాధవీరెడ్డికి కూర్చీ వేయాలంటూ మొదలైన వివాదం చివరకు చిలికి చిలికి గాలివానగా మారింది. ఫలితంగా మూడు సమావేశాలు రసాభాసగా మారగా, మేయర్

కుటుంబ సభ్యుల సంస్థకు పనులు కట్టబెట్టడంపై మేయర్ సురేష్‌బాబుపై అవినీతి ఆరోపణలు చేస్తూ ముఖ్యమంత్రి, డీజీపీ కార్యాలయాలకు కడప ఎమ్మెల్యే మాధవి 2024 డిసెంబరు 30న ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి.... మేయర్ సురేష్ బాబు మున్సిపల్ కార్పొరేషన్ చట్టం నిబంధనల్ని ఉల్లంఘించారని నిర్ధారించారు. ఆయన కుటుంబ సభ్యులకు చెందిన వర్ధిని కన్స్ట్రక్షన్స్ పది పనులకు టెండర్లు ఏడింటిని పూర్తి చేసిందని, అందుకు రూ.33.65 లక్షలు బిల్లులు పొందారని విచారణలో తేల్చారు. సదరు నివేదిక ఆధారంగా పురపాలక శాఖ ఆయనపై అనర్హత వేటు వేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కడప మేయర్ పదవి నుంచి సురేష్ బాబును తొలగిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ శాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ దీనిపై వైసీపీ కోర్టును ఆశ్రయించింది. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. అయితే సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే ఇవ్వడంతో సురేష్ బాబుకు ఊరట దక్కినట్టైంది.

**రక్షణ కల్పించాలంటూ వైసీపీ కార్పొరేటర్ల వినతి :**

వైసీపీ వినతి మేరకు కార్పొరేటర్లకు రక్షణ కల్పించి సమావేశం సజావుగా సాగేలా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం సజావుగా సాగేలా చూడా ల్సిన బాధ్యత అధికారులదేనని, సర్వసభ్య సమావేశానికి భద్రత కల్పించి సమావేశం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పిని కలసి వైసీపీ కార్పొరేటర్లు ఇది వరకే వినతి పత్రం సమర్పించారు. 6 నెలలుగా నగరపాలక సంస్థ బడ్జెట్, సర్వసభ్య సమావేశాలు నిర్వహించకుండా టిడిపికి తొత్తుగా అధికారులు వ్యవహరిస్తున్నారని, రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశం హాలును తెరవాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకుండా కౌన్సిల్ సమావేశం హాలు బీగా లను కమిషనర్ వద్దనే ఉంచుకుని నియంతగా వ్యవహరిస్తున్నారని అరోపించారు. గత సమావేశాలలో చేసిన తీర్మాణాలను కూడా అమలు చేయకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరపాలక సంస్థకు ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. జనరల్ ఫండ్ ద్వారా ప్రజలు కట్టిన పన్నును వివిధ కార్యక్రమాలకు వాడుతున్నారని విమర్శించారు.

**సర్వసభ్య సమావేశానికి సిద్ధమైన ఇరు పార్టీలు :**

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారుతుండగా శుక్రవారం జరిగే సర్వసభ సమావేశానికి కూడా ఇరు పార్టీలు సమాయత్తమయ్యాయి. కోర్టు సమావేశాన్ని సజావుగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయగా మరోవైపు ఇరు పార్టీలు తమ కార్యకర్తలను అందుబాటులో ఉండాలని సూచించాయి. వైసిపి చెందిన కార్పొరేటర్లు టిడిపి కార్యకర్తలు సమావేశం హాల్లోకి వచ్చి సభను జరగనీయకుండా చేస్తున్నారంటూ కోర్టు దృష్టికి తీసుకువెళ్లగా వైసీపీ కార్పొరేటర్లకు రక్షణ కల్పించాలని కోర్ట్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో అధికారులకు, పోలీసులకు ఈ సమావేశం నిర్వహణ కత్తి మీద సాముల మారింది.

**ఆరు నెలలుగా జరగని సర్వసభ్య సమావేశం :**

కడప మున్సిపల్ కార్పొరేషన్ లో మొదలైన కూర్చీ గొడవ కారణంగా సర్వసభ్య సమావేశం రసాభాసగా మారుతున్న వస్తోంది. దీంతో ఆరు నెలలుగా సమావేశం జరగడం లేదు. కానీ నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోపు మళ్లీ నిర్వహించకపోతే పాలకవర్గం రద్దయ్యే అవకాశం ఉంది. ఇప్పుడు గడువు సమీపిస్తున్న దృష్ట్యా ప్రస్తుత పరిణామాలు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

**మరోమారు నోటీసులు పంపిన మున్సిపల్ శాఖ:**

మేయర్ పదవి నుంచి తొలగించిన రెండు వారాల తర్వాత నుంచి ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని అప్పట్లో కార్యాలయం పేర్కొంది. దీనిపై మేయర్ హైకోర్టు డివిజన్ బెంచ్కు అప్పీల్ చేసుకున్నారు. ఆయనకు తన వాదన వినిపించుకోవడానికి మరో అవకాశం ఇవ్వాలని డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఆ మేరకు జూన్ 16న మేయర్ హాజరు కావాలని పురపాలక శాఖ మళ్లీ నోటీసు పంపగా, తీసుకోవడానికి సురేష్ బాబు నిరాకరించారు. బుధవారం తీసుకుంటానని చెప్పినట్లు సమాచారం. కానీ ఆయన న్యాయవాదిని వెంట తీసుకుని వెళ్లి మున్సిపల్ శాఖకు తన వాదన వినిపించినట్లు సమాచారం. అయితే వ్యవహారం కోర్టు పరిధిలో ఉండటంతో మున్సిపల్ శాఖ ఎమి చెయ్యలేని పరిస్థితి.



## గండి ఆలయ పునఃనిర్మాణంలో.. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం : అవినాశ్‌రెడ్డి

**టీపీఎన్, కడప:**

పులివెందుల నియోజకవర్గం గండి క్షేత్రంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామిని ఈరోజు కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజస్వామి వేద ఆశీర్వాదం అందించారు .అనంతరం ఆయన గండిక్షేత్రంలో జరుగుతున్న నూతన ఆలయ పునః నిర్మాణ పనులను పరిశీలించారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి 28 కోట్ల రూపాయలను ఆలయ అభివృద్ధి కోసం మంజూరు చేసి 95 శాతం పనులు పూర్తి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిన మిగిలిన 5 శాతం శాతం పనులను కూడా పూర్తి చేయలేక నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. గండి క్షేత్రానికి ఎంతో ప్రసిద్ధి ఉందని స్వయంగా శ్రీరామచంద్రుడు తన బాణంతో మూల విరాట్‌ను మలిచారని, సజీవంగా ఉన్న శ్రీ గండి ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి శ్రావణ మాసాలలో లక్షల్లో భక్తులు వస్తుంటారన్నారు. గత నాలుగు శ్రావణ మాసాల నుండి మూలవిరాట్ దర్శనం కల్పించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ ప్రస్తుత పాలక మండల సభ్యులకు మంచి పేరు వస్తుందో అని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం కరెక్ట్ కాదన్నారు. పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా.. కనీసం స్పందించడం లేదన్నారు. మహా కుంభాభిషేకం చేయడానికి మరో 10 కోట్ల రూపాయలు అవసరం ఉంటుందని ఆలయ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినా.. ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి రూ.28 కోట్లు సీజీఎఫ్ గ్రాండ్ కింద ఇచ్చారని.. ఇక ఇచ్చే ప్రసక్తి ఉండదని.. భక్తుల విరాళాలతో జరిపించుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్ అంటున్నారని చెప్పారు.వచ్చే శ్రావణమాసంలోపు నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం పూర్తిచేసి భక్తులకు స్వామివారి మూలవిరాట్ దర్శనం కల్పించేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో జెడ్పీటీసీలు రవికుమార్ రెడ్డి,శివ ప్రసాద్ రెడ్డి, వైసీపీ నేతలు బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి, కల్లూరు చంద్ర ఓబుల్ రెడ్డి, ఆర్ శ్రీనివాసులు, సింగా రెడ్డి రోహన్ నాగిరెడ్డి, గండి చైర్మన్ కావలి కృష్ణ తేజ, ఎంపీపీ మాధవి బాలకృష్ణ, పలువురు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అమరరాజా కంపెనీని కుల ద్వేషంతో తరిమికొట్టారు: కన్నా

**టీపీఎన్ | సుమంత్ జంగం**



పల్నాడు: వైసీపీ అధినేత జగన్‌పై టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి పై పల్నాడు జిల్లా పర్యటనపై విమర్శల వర్షం గుప్పించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ సంతాప పర్యటన యుద్ధ ప్రచారంలా ఉందని ఆవేశం వ్యక్తం చేశారు. రెంటపల్ల గ్రామంలో నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు జగన్ 100 శాతం బాధ్యుడని కన్నా నేరుగా ఆరోపించారు. "ఇది పోలీసుల వేధింపుల కారణం కాదు, వైఎస్‌ఆర్‌సీపీ యొక్క రాజకీయ క్రూరత్వం అతన్ని ఈ స్థితికి నెట్టింది" అని ఆయన అన్నారు. జగన్ పర్యటన సందర్భంగా నిర్వహించిన ర్యాలీ అరాచకంగా ఉందని, అది అల్లర్లకు మరియు ఇద్దరు వ్యక్తుల మరణానికి దారితీసిందని ఆయన వివరించారు. "ఇది ప్రజాస్వామ్యం కాదు; ఇది రాక్షస ప్రవర్తన" అని ఆయన అన్నారు.జగన్ ప్రజాస్వామ్య హక్కుల గురించిన చేసిన ప్రకటనలను "రాక్షసులు వేదాలు పఠిస్తున్నట్లు" అని కన్నా పోల్చారు. జగన్ పాలనలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వంటి విపక్ష నాయకులను అడ్డుకుని, నిర్బంధించారని ఆయన గుర్తు చేశారు. "ఇప్పుడు అతను ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారా..?" అని కన్నా ప్రశ్నించారు. టీడీపీ నాయకులపై జగన్ కుల ద్వేషం ఆధారంగా వ్యవహరించారని ఆరోపించారు. "కమ్మ సామాజిక వర్గం పట్ల ద్వేషం కారణంగానే అమరరాజాను తరిమికొట్టారు మరియు అమరావతిని ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారు" అని ఆయన ఆరోపించారు. వైఎస్‌ఆర్‌సీపీ ర్యాలీ సందర్భంగా జరిగిన హింస మరియు మరణాలకు జగన్ పూర్తి బాధ్యత వహించాలని కన్నా డిమాండ్ చేశారు. ఎన్ని బెదిరింపులు లేదా నాటకాలు చేసినా జగన్‌ను ప్రజల ఆగ్రహం నుండి రక్షించలేవని హెచ్చరించిన కన్నా, పల్నాడు ప్రజలు ఈ "రాజకీయంగా రూపొందించిన తమాషాను" గమనిస్తున్నారని, దానికి సమాధానం ఇస్తారని తెలిపారు.




## ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిపై రాచమల్లు ఫైర్

**టీపీఎన్, కడప :**

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో తాను అవినీతికి పాల్పడినట్లు పదేపదే ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి తనని విమర్శించడం తగదని రాచమల్లు తెలిపారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశానని, ప్రజల ఆస్తులు కబ్జా చేశానని ఎమ్మెల్యే విమర్శించడం మానేసి అధికారంలో వాళ్ల ప్రభుత్వమే ఉంది కాబట్టి తనపై ఎమ్మెల్యే చేసే ఆరోపణలపై విచారణ చేపించాలని రాచమల్లు సవాల్ విసిరారు. తాను అప్పటి తమ పార్టీ కౌన్సిలర్లు అయిన ప్రస్తుత టీడీపీ కౌన్సిలర్లు చెప్పిన వారికి ఉద్యోగాలు తన శక్తి మేర వేయించానే తప్ప ఒక రూపాయి కూడా డబ్బు తీసుకోలేదన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరు సార్లు గెలిచినందుకు మంచి అయితే.. మూడు సార్లు ఓటమి పాలయ్యారు. దీనిని ప్రజలు తిరస్కరించారని అనుకోవాలా..? అంటూ ప్రశ్నించారు. రాజకీయాల నుంచి 15 సంవత్సరాలుగా వరద కనుమరుగైపోయారన్నారు. కష్టాల్లో ప్రజలకు అండగా నిలిచింది తాను తప్ప మరెవరు లేరన్నారు. గతంలో ప్రతిపక్ష పార్టీకి ఉక్కు ప్రవీణ్ అండగా ఉన్నారన్నారు. వరద గెలుపు గెలుపే కాదని విమర్శించారు.



# కొల్లేరు కాలుష్య నివారణ చర్యలపై నివేదిక ఇవ్వండి

**ఏలూరు :**

పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ఉప్పుటేరులో కలిసే ఇరిగేషన్ డ్రైన్లు, డ్రైన్ల ద్వారా కొల్లేరులోకి వచ్చే కాలుష్యాన్ని నివారించేందుకు తీసుకుంటున్న చర్యలు, డ్రెయిన్ల డీసిల్టింగ్ పనులపై నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావును కేంద్ర సాధికార కమిటీ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ గోయల్ ఆదేశించారు. కొల్లేరుపై సుప్రీం కోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ బృందం రెండు రోజుల పాటు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు విస్తరించిన కొల్లేరు సరస్సు సమస్యలపై అధ్యయనం చేసింది. ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో బుధవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కొల్లేరు ప్రాంతంలో పర్యావరణం, కాలుష్యం, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రహదారులు,భవనాలు, ఏలూరు నగరపాలక సంస్థ, ఆర్ డబ్ల్యూఎస్, తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. చంద్రశేఖర్ గోయెల్ మాట్లాడుతూ కొల్లేరు 5వ కాంటూర్ పరిధిలో 47 నాన్‌నోటిఫైడ్ డ్రైన్లు, కొల్లేరు 5వ కాంటూర్ అవతల 67 నోటిఫైడ్ డ్రైన్లు ఉన్నాయన్నారు. ఇవి అన్ని ఉప్పుటేరులో కలుస్తాయన్నారు. కొల్లేరు వన్యప్రాణి అభయారణ్యంగా ప్రకటించాక ముందు కొల్లేరు గ్రామాలలోని అంతర్గత రోడ్లు, గ్రామాలను కలిపే లింక్ రోడ్లు, ప్రస్తుతం వాటి నిర్వహణ, కొత్తగా నిర్మించిన, నిర్మించే రోడ్లపై ,కొల్లేరు అభయారణ్య పరిధిలో రోడ్ల నిర్మాణం, రోడ్ల నిర్వహణలపై ఉన్న సమస్యలపై నివేదిక అందించాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణమూర్తిని కమిటీ సభ్యులు ఆదేశించారు. అనంతరం ఏలూరు నగరం పారిశుద్ధ్య వ్యర్ధాలు, వ్యర్ధాల శుద్ధీకరణ సామర్థ్యం, కొల్లేరులో కలిసే ఏలూరు పారిశుద్ధ్య వ్యర్థాల వివరాలపై నివేదిక సమర్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను కమిటీ సభ్యులు ఆదేశించారు. ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ.. ఏలూరు నగరంలో 32 ఎంఎల్‌డీ వ్యర్థాలు విడుదల అవుతాయని, వీటిలో పారిశుద్ధ్య వ్యర్థాలు 7 ఎంఎల్‌డీ ఉంటాయన్నారు. 5 ఎంఎల్‌డీ వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్ ఏలూరులో ఉన్నదన్నారు. మరో 50 ఎంఎల్‌డీ వ్యర్థాలు శుద్దీకరణ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. మిగిలిన వ్యర్థాలు తమ్మిలేరు ద్వారా కొల్లేరులో కలుస్తున్నాయని కమిటీ సభ్యులకు తెలియజేశారు. కొల్లేరు పరిధిలో పర్యావరణం, కాలుష్య పరిస్థితులు, చేపల పెంపకానికి వినియోగించే నీరు, తాగునీటి కాలుష్యం, పరిశ్రమల ద్వారా కొల్లేరులోకి వెళ్లే వ్యర్థాల కారణంగా కలిగే కాలుష్యం, తదితర వివరాలపై సవివరమైన నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావును కమిటీ సభ్యులు ఆదేశించారు. కొల్లేరులో తాగునీరు, భూగర్భ జలాలు, డ్రైన్లలో కాలుష్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావు కమిటీకి తెలియజేశారు. కొల్లేరులో ఎన్ని రకాల చేపల పెంపకం జరుగుతుంది, కాలుష్య నీటిలో ఉత్పత్తి అయ్యే చేపల వినియోగం కారణంగా అనారోగ్య సమస్యలు, చేపల పెంపకానికి వినియోగించే రసాయనిక ఎరువులు, పురుగుమందుల వివరాలు, వాటి కారణంగా కొల్లేరులో కలిగే కాలుష్యం, తదితర విషయాలపై నివేదిక సమర్పించాలని మత్స్య శాఖాధికారులను కమిటీ సభ్యులు ఆదేశించారు. మత్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్ మాట్లాడుతూ.. బుడమేరు ద్వారా విజయవాడ నగరంలోని వ్యర్థాలు కొల్లేరులో కలుస్తున్నాయని వివరించారు. తాము కోరిన సమాచారాన్ని ఆయా శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ ద్వారా త్వరితగతిన పంపాలని కమిటీ సభ్యులు ఆదేశించారు.

# చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర

**నెల్లూరు :**

చేనేత సహకార సంఘాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీని వలన చేనేత వ్యవస్థ నిర్వీర్యం అవుతున్నాయని ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు లేదా పాలక మండలి నియమించాలి అని దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర డిమాండ్ చేశారు. ఏ మేరకు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం నారాయణరెడ్డి పేటలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడరు. జగన్ ప్రభుత్వంలో నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న వారికి ఏడాదికి 24000 ఇచ్చి ఆదుకొన్నారు కానీ ఆ పథకాన్ని కూడా కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాము. 200 యూనిట్లు విద్యుత్ GO కి పరిమితం చేయకుండా వెంటనే అమలు చేయాలి అఫ్కో చైర్మన్ ని నామినేట్ చేసి ఇంతవరకు GO ఇవ్వకపోవడం దారుణమన్నారు. చేనేత వర్గం పై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి తార్కాణం. ప్రభుత్వం తలుచుకొంటే GO ఇవ్వలేదా అని అడుగుతున్నాము . చేనేత వర్గం మద్దతుతో గెలిచిన లోకేష్ దీని పై వెంటనే స్పందించాలి . ఎన్నికల్లో GST గురించి హామీ ఇచ్చిన లోకేష్ ఇప్పటి వరకు దాని గురించి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అభివృద్ధి తో పాటు ఆకలి చావులు లేకుండా చూడవలసిన భాద్యత ప్రభుత్వానిదే కానీ అభివృద్ధి అని కొంగ జపం చేస్తున్నా ప్రభుత్వం పేదల సంక్షేమం పట్టించుకోకపోవడంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వం పై ఆశలు సన్నగిల్లుతున్నాయి అన్నారు . ఈ కార్యక్రమంలో చేనేత సొసైటీ మాజీ ఇంచార్జీ శీతా సుధాకర్, మాస్టర్ వివర్ పడవల వెంకట శేషయ్య, చేనేత నాయకులు మధిర దయాకర్ పాల్గొన్నారు.





# మరింత సులువుగా వరసిద్ధి వినాయకుని దర్శనం

- కాణిపాకంలో ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ పర్యటన
- భక్తులకు కల్పించే సౌకర్యాలపై ఆర్‌జేసీ ఆరా

**కాణిపాకం:**

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తిరుపతి దేవదాయ శాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. శ్రీ స్వామి వారి దేవస్థానం నందు భక్తులకు వసతి మౌలిక సదుపాయాలపై పరిశీలించిన తిరుపతి దేవదాయ శాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానము ఈవో పెంచల కిషోర్‌తో కలిసి శ్రీ స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్లు, లడ్డు పోటు, పడితరం స్టోర్, అన్నదానం, సీసీ కెమెరాల రూమ్ పరిశీలించారు. ఈవో కార్యాలయం మీటింగ్ హాలులో జిల్లాలోని వివిధ చిన్న దేవాలయాలు విచ్చేసిన ఈవోలు, అధికారులతో మౌలిక సదుపాయాలపై సమావేశం నిర్వహించి ఆలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలపై వివిధ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఏసీ చిట్టెమ్మ, ఏఈఓలు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ, సూపర్డెంట్లు, వివిధ దేవాలయల ఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తాం

- మంత్రి నాదెండ్ల మనోహర్
- ఈ ఏడాది జిల్లాలో 15వేల హెక్టార్లో ఆయిల్ ఫామ్ సాగు టార్గెట్
- ఆయిల్ ఫామ్ సాగుచేసే రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం సహకారం
- జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో మోనిటరింగ్ కమిటీ ఏర్పాటు..




**ఏలూరు/పెదవేగి, జూన్, 18:**

ఏలూరు జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు పెద్దఎత్తున ప్రోత్సహించే దిశగా ఈఏడాది 15 వేల హెక్టార్లలో ఆయిల్ ఫామ్ పంట విస్తరించాలనే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి, జిల్లా ఇన్ చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

బుధవారం పెదవేగిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు మరియు ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రోసెసర్లతో ఆయిల్ ఫామ్ పరిశోధనా, అభివృద్ధి కార్యకలాపాలను మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షించారు. కొత్త అధిక దిగుబడినిచ్చే రకాలు, కోకో వంటి అంతర్ పంటల అవగాహన డెల్టా భూముల్లో ఆయిల్ ఫామ్ ప్రోత్సహించడం వరి, పొగాకు, తదితర పంటల నుండి పంట వైవిద్యీకరణ ఆయిల్ పామ్ లో యాంత్రీకరణను ప్రోత్సహించడం మొదలైన వాటిపై సమావేశంలో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోనే పెదవేగిలోని ఆయిల్ పామ్ పరిశోధనా కేంద్రం ఉన్నతమైన స్థానంలో ఉందన్నారు. ఈ కేంద్రం ద్వారా అనేక మంది రైతులకు ఆయిల్ ఫామ్ ప్రోసెసర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కేంద్రంలో దాదాపు 29 మంది శాస్త్రవేత్తలు ఉన్నారన్నారు. చక్కటి మౌలిక సదుపాయాలతో ఏలూరు జిల్లాలో ప్రత్యేకంగా పెదవేగి మండలంలో 250 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట పరిశోధన, టిష్యూకల్చర్ తదితర అంశాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ రైతాంగానికి ఎక్కువ దిగుబడులు వచ్చే ప్రక్రియను, వివిధ పరిశోధనలను సంస్థ డైరెక్టర్ డా. కంచర్ల సురేష్ లోతుగా వివరించడం జరిగిందన్నారు. ప్రధానంగా ఉన్న 5 కంపెనీల ప్రతినిధులతో, శాస్త్రవేత్తలతో సుదీర్ఘంగా ఆయిల్ ఫామ్ పంటసాగుపై సమీక్షించడం జరిగిందన్నారు. రైతాంగం పంటసాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామన్నారు. అభివృద్ధిలో జిల్లాను 5వ స్థానం నుంచి 3 వ స్థానంకు తీసుకువెళ్లేందుకు కృషిచేస్తున్నామన్నారు. జిడిపి పెరిగేందుకు ఉధ్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట మరింత విస్తరించాలని, రైతులను ప్రోత్సహించే విషయంపై గౌ. ముఖ్యమంత్రి సమక్షంలో అనేక సందర్భాల్లో చర్చించడం జరిగిందన్నారు. ఈఏడాది 5 వేల హెక్టార్ల నుండి 15 వేల హెక్టార్లకు ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని టార్గెట్ గా నిర్ణయించామన్నారు. దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రబాకర్ ఆయిల్ ఫామ్ పంటసాగులో పంట సమస్యలను వివరించారని, డెల్టా ప్రాంతంలో కూడా ఆయిల్ ఫామ్ పంట సాగును ప్రోత్సహించేందుతు చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. పంటసాగులో రైతులు ఎదుర్కొంటున సమస్యల పరిష్కారంలో, క్షేత్రస్థాయిలో వాస్తవ సమాచారం అందరితో పాలుపంచుకోవడంలో కొంత జాప్యం కనబడుతుందన్నారు. దీనిని పరిష్కరించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో మోనాటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. రైతు సహాయకేంద్రంలో సిబ్బంది, క్షేత్రస్థాయిలో పర్యటించే హార్టికల్చర్ ఫీల్డ్ విస్తర్ణాధికారులతో పాటు ప్రధానమైన 5 ప కంపెనీల ప్రతినిధులు పెదవేగి ఆయిల్ ఫామ్ పరిశోదన కేంద్రం సహకారంతో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ప్రతినెలా ఒక సమావేశం ఏర్పాటుచేసి సమస్యలు ఏమైనా ఉంటే వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పురుగుల నివారణకు ఎటువంటి ఎరువులు వినియోగించాలి, డ్రిప్ ఇరిగేషన్ తదితర అంశాలపై కూడా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం చాలా దారుణంగా ఆయిల్ ఫామ్ కు ఒక రూపాయి కూడా సబ్సిడీ ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని, అదే విధంగా ఆయిల్ ప్రొడ్యూసర్లను కూడా మోసం చేసి సుమారు రూ. 54 కోట్లు బకాయిలు పెట్టిందని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఎంతవరకు ప్రభుత్వం తరపున నిలబడగలమో పరిశీలిస్తామన్నారు. ఇటువంటి పొరపాటు ఇక జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆధునిక వ్యవసాయ పరికరాలు, రైతులు కష్టపడి తెచ్చుకున్న మొక్కలకు సంబంధించి రైతులకు అందించాల్సిన సబ్సిడిలో ఎటువంటి జాప్యం లేకుండా నూరుశాతం కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా చేసుకోగలిగితే డెల్టా ప్రాంతంలో కూడా ఆయిల్ ఫామ్ సాగును విస్తరించుకొవడంతోపాటు ఇతర జిల్లాల్లో కూడా రైతులను ప్రోత్సహించేందకు వీలు కలుగుతుందన్నారు. అదే విధంగా 2027వరకు ఉన్న జాతీయ ఆయిల్ మిషన్, ప్రధానమంత్రి నరేంద్రమోడి ఆలోచనలు మేరకు ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫామ్ సాగులో దేశంలో సింహభాగంలో నిలుస్తుందన్నారు. కేంద్రం నుండి రావల్సిన సబ్సిడీలను ప్రోత్సహక విధానాన్ని అందిపుచ్చుకుని మన ప్రాంతంలో మెరుగైన ఆయిల్ ఫామ్ సాగును తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు.



# పార్కింగ్ పేరుతో అమ్మవారి భక్తులకు నిలువుదోపిడీ!



- **దుర్గగుడి స్థలం కబ్జా**
- **కబ్జా స్థలంలో పార్కింగ్ దందా**
- **రోడ్లపైనే పార్కింగ్ చేయిస్తూ వసూళ్లు**
- **పట్టించుకోని పోలీసులు, కార్పొరేషన్, దుర్గగుడి అధికారులు**

**టీపీఎన్, కరస్పాండెంట్, విజయవాడ :**

దుర్గగుడికి వచ్చే భక్తులు దోపిడీకి గురువుతున్నారు. పార్కింగ్ కోసం కాంట్రాక్టు పాడుతున్న వ్యక్తులు ఏకంగా రోడ్డును కూడా ఆక్రమించేశారు. దర్జాగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయించి డబ్బులు వసూలు చేస్తున్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్నారేంటని అడిగిన భక్తులపై కాంట్రాక్టు సిబ్బంది దాడులకు తెగబడుతున్నారు. ఇక స్థానికంగా వన్ టౌన్ లో పని ఉండి వచ్చిన వారి దగ్గర నుంచి ముక్కుపండి మరీ వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా దుర్గగుడి, కార్పోరేషన్, పోలీసు అధికారులు మాత్రం పట్టించుకోక పోవడం విశేషం.

రాష్ట్రంలో రెండో అతి పెద్ద ఆలయంగా దుర్గగుడి ప్రసిద్ధి. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తుంటారు. శుక్ర, శని, ఆదివారాలు అయితే ఈ భక్తుల సంఖ్య రెట్టింపు సంఖ్యలో ఉంటుంది. దుర్గగుడికి వచ్చే భక్తుల కోసం రాజగోపురం మార్గంలో పార్కింగ్ , ఘాట్ రోడ్డు పై ఓంకారం వద్ద మరో పార్కింగ్ ను దుర్గగుడి అదికారులు కేటాయించారు. దీనికి ప్రైవేటు వ్యక్తుల పాట పాడుకుని నిర్వహిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది.. కానీ దుర్గగుడి కింద రథం సెంటర్ దగ్గర ఉన్న రోడ్డును కూడా పార్కింగ్ కాంట్రాక్టర్లు ఆక్రమించేశారు. రోడ్డుకు ఇరు వైపులా కారు పార్కింగ్ చేయించి.. దర్జాగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే.. ఇది కూడా దుర్గగుడి పార్కింగ్ అని దబాయిస్తున్నారు. ఇక విజయవాడ వన్ టౌన్ అంటనే హోల్ సేల్ మార్కెట్ కు పెట్టింది పేరు.. దీంతో వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు కోసం ఇక్కడకు వస్తారు. వారితో కూడా ఇక్కడే కార్లు పార్కింగ్ చేయించి, డబ్బులు రెట్టింపు లో వసూలు చేస్తున్నారు. ఇక కారులో కుటుంబ సభ్యులు, పిల్లలు ఎక్కేందుకు ఆ ప్రాంతంలో ఎవరైనా కారు ఆపినా.. కూడా వీరికి పార్కింగ్ ఫీజు కట్టాల్సిందేనంట.. లేదంటే.. అసలు అక్కడ కారు ఆపకుండా ఎక్కడో దూరాన పెట్టుకుంటే.. వృద్దులు,పిల్లలు అక్కడి వరకు వెళ్లి ఎక్కాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. మేం చెప్పినంత కట్టాకే నీ వాహనం ఇక్కడి నుంచి కదులుతుందని భక్తులను బెదిరిస్తున్నారు. ఎవరైనా అదేమిటని అడిగితే.. నీకు దిక్కున్నచోట చెప్పుకో. కారు పార్కింగ్ ఫీజు కట్టండి.. లేదా ఎవరికైనా చెప్పుకోండి అని దాడికి యత్నిస్తున్నారు. దీనిపై అనేక సార్లు పిర్యాదులు చేసినా.. దుర్గుగుడి అధికారులు, పోలీసులు, కార్పోరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు. అసలు బ్యారేజీ నుంచి బస్టాండ్ వైపుకు వెళ్లే ప్రధాన దారిలో పార్కింగ్ కు ఎలా అనుమతి ఇచ్చారో సంబంధిత అదికారులే చెప్పాలి.. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోక పోవడంతో.. వారి ఆగడాలను ప్రజలే ఫోన్లలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. అందులో కూడా మీ ఇష్టం వచ్చినవాళ్లకు చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నా.. అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దుర్గగుడికి వచ్చేవారు, వ్యాపారాల నిమిత్తం వన్ టౌన్ కు వచ్చే వారు పార్కింగ్ ఫీజు పేరుతో దోపిడికీ గురి అవుతున్నారు. ఇటు దుర్గగుడి పార్కింగ్ కాంట్రాక్టర్లు, అటు కార్పోరేషన్ స్థలాల్లో పార్కింగ్ కాంట్రాక్టర్లు కలిసి ప్రజలను దోచుకుంటున్నా.. వారి ఆగడాలను ఆపే అధికారులే కరువయ్యారు. ఎవరైనా అదేమిటని అడిగితే చాలు.. మొత్తం సిబ్బంది అంతా కలిసి పోయి ఆ వ్యక్తిపైకి దాడికి తెగబడుతున్నారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా... చోద్యం చూస్తున్న అదికారుల తీరు కారణంగా కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. ఇప్పటికైనా ఇటువంటి దోపిడీకి, ఆగడాలకు పుల్ స్టాప్ పెట్టేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



## హనుమంత వాహనంపై విహరించిన శ్రీ సుందరరాజస్వామి వారు


తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు రెండవ రోజు వైభవంగా సాగాయి. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య స్వామి వారికి కళ్యాణోత్సవం చేపట్టారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య శ్రీ కృష్ణ స్వామివారి ముఖ మండపంలో శ్రీ సుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం చేశారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనాలతో వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 5.45 నుంచి 6.15 గంటల మధ్య ఊంజల్ సేవ చేపట్టారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల మధ్య హనుమంత వాహనంపై నాలుగు మాడ వీధుల్లో స్వామివారు విహరించారు. జూన్ 19న శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు ముగియనున్నాయి. రాత్రి 7 నుంచి 8.30 గంటల మధ్య గరుడ వాహనంపై స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఆర్జితం ఇన్స్పెక్టర్ కె.చలపతి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# యోగాంధ్ర కార్యక్రమంపై వినూత్న ప్రదర్శన..!

**టీపీఎన్, కాకినాడ జిల్లా :**

పిఠాపురం పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక బాదం మాధవ గవర్నమెంట్ హై స్కూల్ ప్లస్ నందు పిల్లలను యోగాంధ్ర రూపంలో కూర్చోబెట్టి వినూత్న ప్రదర్శన నిర్వహించారు. యోగా గురు వనం సత్యప్రియ ఆధ్వర్యంలో నిర్వహించినందుకు స్కూల్ ప్రిన్సిపల్, పిఠాపురం మండల ఆఫీసర్ గంట శ్యామ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిడి మంగయ్యమ్మ, పిడి శేష్‌కుమారి ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ రెజ్లింగ్ పోటీలకు కుమార్..!

**టీపీఎన్, విజయవాడ :**

ఈ నెల 20 నుంచి 23 వరకు నాగపూర్‌లో జరిగే అండర్15 జాతీయ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు బి.కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు.ఇటీవల రాజమండ్రి లో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో కుమార్ 41 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల హిందూ హైస్కూల్ కమిటీ అధ్యక్షులు శేషయ్య, కరెస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి జీ బాబా విజయ్ కుమార్, కార్యదర్శి కేఎల్‌వీ మోహన రావు, పాఠశాల పీఈటీ ఎంవీ సత్య ప్రసాద్ అభినందించారు.




## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి..!

**టీపీఎన్, నెల్లూరు :**

అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపట్టినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం అమరావతి సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జూన్ 21 శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలు నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వార్డు, గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి వరకు 7 వేల ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అందరూ తమ పరిధిలో ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రదేశాల్లో యోగా ట్రైనర్స్, ఇన్‌చార్జిలను నియమించి కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సుమారు 10వేల మందితో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థులు, స్వయం సహాయ సంఘాల మహిళలు, అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత అందరిని పెద్దఎత్తున భాగస్వామ్యం చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో నోడల్ ఆఫీసర్ యతిరాజ్, డీఈవో బాలాజీ రావు, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## యంత్రీకరణ విధానాలను రైతులకు చేరువ చేయాలి..!

టీపీఎన్, నెల్లూరు : వ్యవసాయ యాంత్రీకరణలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులను రైతులకు మరింత చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ వ్యవసాయ అధికారులకు సూచించారు. గురువారం ఉదయం నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జిల్లాస్థాయిలో వ్యవసాయ యంత్ర పరికరాలను కలెక్టర్ ఆనంద్ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 202425 సంవత్సరమునకు గాను వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా జిల్లాలో 1452 వ్యవసాయ యంత్రపరికరాలను రాయితీపై రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పరికరాల మొత్తం ధర రూ.6,80,48,750 కాగా.. రూ.2,86,96,220 రాయితీగా మంజూరు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ శాఖలోని సిబ్బంది అందరూ టెక్నాలజీపై పట్టు సాధించి, విస్తృతంగా ప్రచారం చేసి రైతులకు ఉపయోగపడేలా చేయాలన్నారు. మట్టి నమూనాల పరీక్షల నుంచి, వివిధ పంటల దశలలో అవసరమయ్యే శాస్త్రీయతను రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రాంతీయంగా రైతులకు ఉపయోగపడే పనిముట్లను రూపొందించాలని పరిశోధన కేంద్రం వారికి సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి మాట్లాడుతూ.. నియోజకవర్గాల వారీగా ఎన్ని పరికరాలు, ఎంత సబ్సిడీ ఇచ్చారో వివరించారు. వీరితో పాటుగా ఆగ్రోస్ రీజనల్ మేనేజర్ విద్యాసాగర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## సంపూర్ణ అవగాహనతోనే సికిల్ సెల్ నిర్మూలన..!

- **వ్యాధికి అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు**
- **గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టితో కార్యక్రమాలు**

**టీపీఎన్, ఎన్టీఆర్ జిల్లా :**

సంపూర్ణ అవగాహనతోనే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించవచ్చని.. జూన్ 19 నుంచి పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం వరల్డ్ సికిల్ సెల్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండపల్లి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌వ్యాధి సమగ్ర సమాచారానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, మ్యాన్యువల్‌స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047కు ముందే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వ్యాధికి సంబంధించి వివిధ వర్గాల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. సాధారణంగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటే సికిల్ సెల్ వ్యాధిలో ఈ కణాలు కొడవలి ఆకారంలో ఉంటాయని వివరించారు. ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందని.. ఇది అంటు వ్యాధి కాదని వివరించారు. రక్త పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఉన్న వ్యక్తి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. సకాలంలో గుర్తించి సరైన వైద్య సదుపాయాలు అందించడం ద్వారా రోగి జీవన నాణ్యతను పెంచొచ్చని పేర్కొన్నారు. రాబోవు తరాలకు వ్యాధి వ్యాపించకుండా నిరోధించాలంటే సరైన అవగాహన ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్‌పర్సన్ సీహెచ్ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎమ్ సుహాసిని, డీటీడబ్ల్యూవో విజయశాంతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవి, వైద్యాధికారులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ విజయకుమార్, నోడల్ అధికారి డాక్టర్ నవీనా, స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## భారత పేదరిక లెక్కల నివేదికలపై
# విమర్శలు..!

భారతదేశం జపాన్, జర్మనీ వంటి దేశాలతో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారేందుకు పోటీపడుతున్నప్పటికీ, ప్రపంచంలోనే అత్యధిక పేదుల సంఖ్య కలిగి ఉన్న దేశంగా అదే దేశం నిలుస్తోంది. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన పేదరిక అంచనాలు ఈ సంఖ్యల్లో భారీ మార్పు చేసి, గణాంకాల ఖచ్చితతపై, దాని ప్రభావాలపై చర్చలకు దారి తీస్తున్నాయి.2024 నివేదికలో, ప్రపంచ బ్యాంకు అత్యంత పేదరిక రేఖ ($2.15 రోజుకి - 2017 కొనుగోలు శక్తి సమానత్వం ప్రకారం) కింద భారతదేశంలో 129 మిలియన్ల మంది ఉన్నారని అంచనా వేసింది. అయితే 2025 అప్డేట్లో ఈ సంఖ్యను గణనీయంగా తగ్గించి 75.2 మిలియన్లు చేసింది - ఇది $3/రోజు (2021 PPP) అనే మరింత ఉన్నత స్థాయి పేదరిక రేఖను ఆధారంగా చేసుకుంది. ఒక్క సంవత్సరంలోనే 54 మిలియన్ల మందికి పైగా పేదలు తగ్గినట్లు చూపించడంపై గణాంక పద్ధతులపై అనుమానాలు తలెత్తుతున్నాయి.ఈ భారీ మార్పుకు ప్రధాన కారణం -2022-2023లో భారత్ నిర్వహించిన వినియోగ సర్వేను ప్రపంచ బ్యాంకు గుర్తించడమే. ఇది 2016-2017లో తీసుకున్న పాత సర్వేకన్నా మెరుగైనదిగా భావించబడింది. ఈ కొత్త సర్వేలో MMRP (మోడిఫైడ్ మిక్స్డ్ రీకాల్ పీరియడ్) అనే పద్ధతిని ఉపయోగించగా, పాత URP (యూనిఫాం రీకాల్ పీరియడ్) పద్ధతితో పోలిస్తే పేదరికాన్ని తక్కువగా చూపిస్తుంది.భారత ప్రభుత్వం ఈ తగ్గుదలను విజయంగా ప్రస్తావించినప్పటికీ, ప్రపంచ బ్యాంకు మాత్రం హెచ్చరిస్తోంది -$2.15 లేదా $3 రోజుకి వంటి పేదరిక ప్రమాణాలు భారత్ లాంటి మధ్య ఆదాయ దేశాలకు తగవు. అటువంటి దేశాల కోసం $6.85/రోజు (2017 PPP) అనే ఆధునిక పేదరిక రేఖను సూచిస్తోంది, ఇది విద్యుత్, వైద్యం, డిజిటల్ యాక్సెస్ వంటి ఆధునిక అవసరాలను పరిగణనలోకి తీసుకుంటుంది.ఈ ప్రామాణికం ప్రకారం, 2022 నాటికి భారతదేశ జనాభాలో 1.17 బిలియన్ మందికి పైగా (సుమారు 82%) ప్రజలు ఇప్పటికీ పేదరికంలో ఉన్నారని అంచనా. ఇది సబ్‌సహారన్ ఆఫ్రికాను కూడా అధిగమించిన సంఖ్య.



AFP

# బోయింగ్ కంటే ఎయిర్‌బస్ భద్రమా..?



గత వారం అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ 787 డ్రీంలైనర్ ప్రమాదం విమానయాన ప్రపంచాన్ని కలిచివేసింది. ఇది ఎయిర్ ఇండియాకు, బ్రాండ్ పునర్నిర్మాణ ప్రయాణానికి గట్టి పోటు కావడమే కాదు, బోయింగ్‌కు కూడా నొప్పిని మళ్లీ గుర్తు చేసింది -ప్రస్తుతం berated అయిన 737 మాక్స్ విమానాల ఘోర ప్రమాదాల కారణంగా ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్న రిప్యూటేషన్‌కు మరొక దెబ్బ. కానీ దీని అర్థం బోయింగ్ కంటే ఎయిర్‌బస్ భద్రమా?

ప్రపంచవ్యాప్తంగా, బోయింగ్ మరియు ఎయిర్‌బస్ విమాన తయారీ రంగాన్ని ఆధిపత్యంగా కలిగి ఉన్న సంస్థలు. 2013 నుంచి 2022 వరకు బోయింగ్‌కు 60 ప్రమాదాలు, ఎయిర్‌బస్‌కు 50 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అయితే బోయింగ్‌కి ఎక్కువ సంఖ్యలో విమానాలు ఉన్నాయి. విమానాల గణాంకాల ఆధారంగా అణిచినప్పటికీ, రెండింటి మరణాల రేటు దాదాపు సమానంగా ఉంది. విమానయాన నిపుణుడు రిచర్డ్ అబౌలాఫియా చెబుతాడు: "గణాంకాల పరంగా చూస్తే, ఈ రెండింటిలో ఏదైనా ఎక్కడం సమానంగా భద్రమైనదే. అసలు సమస్య చాలా అరుదుగా విమానంలోనే ఉంటుంది." అయితే, బోయింగ్‌కి ఎదురవుతున్న సమస్యలు కేవలం సాంకేతికమే కాదు-నైతికతకు సంబంధించినవి కూడా. ఇండోనేషియా మరియు ఈథియోపియాలో జరిగిన 737 మాక్స్ ప్రమాదాలు-దోషపూరిత సాఫ్ట్‌వేర్ వల్ల జరిగినవిగా గుర్తించబడ్డాయి-బోయింగ్ సంస్థ లాభాల కోసం భద్రతను విస్మరించిందని ఆరోపణలకు దారితీశాయి. ఎయిర్‌బస్ కూడా పూర్తిగా దోషరహితం కాదు-2009లో జరిగిన ఎయిర్ ఫ్రాన్స్ A330 క్రాష్, అలాగే $4 బిలియన్ డాలర్ల అవినీతి సెటిల్మెంట్ ఉన్నాయి. ఒక పరిశ్రమ వర్గీయుడి మాటల్లో, "ఎయిర్‌బస్ పాపాలు బోర్డు గదుల్లో జరుగుతాయి; బోయింగ్ పాపాలు కాక్‌పిట్లలో." భద్రతకు పక్కన, బోయింగ్ మరియు ఎయిర్‌బస్ అమెరికా మరియు యూరోప్‌కు చెందిన జియోపాలిటికల్ ప్రత్యర్థులు. వీటి మధ్య వాణిజ్య వివాదాలు, లాబీయింగ్ పోరాటాలు జరిగితే ఆశ్చర్యం లేదు. బోయింగ్ గత దశాబ్దంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ-737 మాక్స్ సంక్షోభం, ఇతర ఘటనలు-2023లో సంస్థ రికార్డు బలంగా ఉంది: 3.1 కోట్ల విమానాల నుంచి కేవలం 11 ప్రమాదాలు మాత్రమే, అవి కూడా ప్రాణహానికాలేనివి.

సామాన్యంగా విమానయానం చాలా భద్రమైనదే: 2023లో ప్రతి 53 లక్షల విమానాలకి ఒక్కదానికే ప్రధాన ప్రమాదం జరిగింది. మిగతా చాలా ప్రమాదాలు పైలట్ తప్పిదాల వల్ల జరుగుతాయి, విమాన రూపకల్పన వల్ల కాదు. బోయింగ్ డ్రీంలైనర్, ఎయిర్‌బస్ A320 లాంటి ఆధునిక విమానాలు అనేక భద్రతా వ్యవస్థలతో రూపొందించబడ్డాయి.

# భారతీయ విద్యార్థులకు అమెరికానే ఉత్తమ గమ్యమా..?

దశాబ్దాలుగా, ప్రపంచస్థాయి విద్యను కోరుకునే భారతీయ విద్యార్థులకి అమెరికా విశ్వవిద్యాలయాలు బంగారు ప్రమాణంగా ఉన్నాయ. సుందర్ పిచై, రఘురాం రాజన్, ఇందిరా నూయి, అమర్త్యసేన్ వంటి ప్రముఖుల విజయానికి అమెరికాలో పొందిన విద్యా పునాది ఎంతగానో తోడ్పడింది. భారతీయ విద్యార్థులు కేవలం అక్కడ చదువుకోవడమే కాక, పరిశోధన, దానధర్మాల ద్వారా అమెరికన్ విద్యా వ్యవస్థకు విలువనూ చేకూర్చారు.అయితే ఈ దీర్ఘకాల ప్రభావం ఇప్పుడు ఒత్తిడికి లోనవుతోంది. ట్రంప్ పరిపాలన కాలంలో విద్యా సంస్థలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు — యాంటీసెమిటిజం, "వైట్ వ్యతిరేకవాదం", రాజకీయ చైతన్యం పేరుతో చర్యలు తీసుకుంటున్నారు. హార్వర్డ్, కొలంబియా లాంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తీవ్ర రాజకీయ విమర్శల మధ్యలో ఉన్నాయి. అంతేకాకుండా, అమెరికా రాయబార కార్యాలయాలు విద్యార్థి వీసా ఇంటర్వ్యూలను నిలిపివేసాయి, సోషల్ మీడియా స్మృతికరణ (social media scrutiny) పేరుతో. భారతీయ విద్యార్థులు తమ గతంలో చేసిన ఆన్లైన్ కార్యకలాపాలను వివరించాల్సిన పరిస్థితి వచ్చింది — ఎవరి భావప్రకటన భవిష్యత్తు అవకాశాలకు ఆటంకం కలిగించగలదో తెలియని గందరగోళం నెలకొంది.భారతీయ కుటుంబాలకి, ఒక పిల్లవాడిని అమెరికాకు పంపడం ఒక కలతో కూడిన దీర్ఘకాల పెట్టుబడి. 2023లో అమెరికాలో 3.3 లక్షల భారతీయ విద్యార్థులు ఉన్నారు — వారు STEM రంగాల్లో కీలక పాత్ర పోషించడమే కాక, అమెరికన్ యూనివర్సిటీలకు ఆర్థికంగా కూడా ఉపకరిస్తున్నారు. కానీ ప్రస్తుతం అమెరికా రాజకీయ సందేశం స్పష్టం: ప్రపంచ ప్రతిభను స్వాగతించడం ఇక నిబంధనలతో పరిమితం.

ఇదంతా ఇప్పటికే ప్రభావం చూపుతోంది. 2025 నాటికి భారతీయ విద్యార్థుల నమోదు 28% తగ్గే అవకాశం ఉంది. ఈ విద్యార్థులు ఇప్పుడు బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా వంటివారి వైపు మొగ్గుచూపుతున్నారు. ఇవి అమెరికా స్థాయి ప్రతిష్ఠ కలిగివుండకపోయినా, తమ విద్యా వ్యవస్థలను రాజకీయంగా చిన్న చూపు చేయడం లేదా విదేశీ విద్యార్థులపై అణచివేతకు పాల్పడడం లేదు.ఈ మార్పు భారతదేశానికి ఒక అవకాశాన్ని తీసుకొస్తోంది. IITలు, IIMలు, అశోకా వంటి ప్రైవేట్ యూనివర్సిటీలు ఇప్పటికే మంచి స్థాయిలో ఎదుగుతున్నాయి. అకడమిక్ స్వేచ్ఛ, పరిశోధన, గ్లోబల్ భాగస్వామ్యాలపై పెట్టుబడి పెడితే, భారతదేశం ఒక కొత్త విద్యా కేంద్రంగా మారే సామర్థ్యం కలిగి ఉంది.ఈ నేపథ్యంలో, రాబోయే సంవత్సరాల్లో అమెరికాలో విద్యాభ్యాసం చేసిన భారతీయుల విజయ గాథలు తగ్గే అవకాశం ఉంది. కానీ భారతదేశం ఈ అవకాశాన్ని పట్టుకుని ముందుకు వెళ్లగలిగితే, తాను మాత్రమే కాదు — అమెరికా మారుతోందని నిరుత్సాహపడుతున్న ప్రపంచ ప్రతిభావంతులకూ ఓ కొత్త ఆశాకిరణంగా మారవచ్చు.



# ఇరాక్ కథే ఇరాన్‌లో రిపీట్ అవుతుందా?

**టీపీఎన్ ప్రతినిధి |**

ఇరాక్ కథే ఇరాన్ విషయంలో రిపీట్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. సద్దాం హుస్సేన్ ను అంతమొందించేందుకు అమెరికా, బ్రిటన్ పక్కా ప్లాన్ వేశాయి. రసాయన ఆయుధాలు ఉన్నాయని..అవి ప్రపంచానికి పెను ప్రమాదం సృష్టిస్తాయనే భయానక వాతావరణాన్ని క్రియేట్ చేసి 2003 మార్చిలో భీకర దాడులు చేసింది. అమెరికా బ్రిటన్ మద్దతుతో ఇరాక్‌పై దాడి చేసింది. ఇరాక్ వద్ద రసాయన ఆయుధాలు ఉన్నాయని, అణు బాంబు తయారీ వైపు అడుగులు వేస్తున్నాయని చెప్పింది. కానీ ఇరాక్ వద్ద రసాయన ఆయుధాలు ఉన్నట్టు ఎలాంటి ఆధారాలు లభిచలేదు. సరిగ్గా 20 ఏళ్ల తర్వాత, దాదాపు అదే కథ మళ్లీ వల్లవేస్తోంది అమెరికా. ఈసారి టార్గెట్ మాత్రం ఇరాన్.

**ఇరాన్ అణ్వాయుధాలపై ట్రంప్ క్లారిటీ..**

ఈ ఏడాది మార్చిలో, అమెరికా నిఘా సంస్థ అధిపతి తులసి గబ్బర్డ్, ఆ దేశ నిఘా సంస్థలను ప్రస్తావిస్తూ అమెరికా పార్లమెంటులో ఇరాన్ అణు బాంబును తయారు చేయడం లేదని అన్నారు. గబ్బర్డ్ వ్యాఖ్యలపై స్పందించలేదు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఆయన ఏమి చెప్పినా తాను పట్టించుకోనని క్లారిటీ ఇచ్చేశారు. నిజం ఏమిటంటే ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయడానికి చాలా దగ్గరగా వచ్చిందన్నారు ట్రంప్.

**ఇరాన్‌పై దాడి వెనుక...**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి వెనుక అతిపెద్ద రీజన్ ఇరాన్ అణు కార్యక్రమం చెపడుతోందని. నిజంగా ఇరాన్ అణు బాంబును తయారు చేయడానికి తగినంత యురేనియంను సమకూర్చుకుందని త్వరలో అణు బాంబును తయారు చేస్తుందని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ నెతన్యాహు వాదనను ఇరాన్ తిరస్కరించింది. తన అణు కార్యక్రమం పౌర ప్రయోజనాల కోసమేనని చెబుతోంది.

ఇరాన్ అమెరికాతో అణు ఒప్పందంపై చర్చలు జరుపుతోంది, దీనిలో యురేనియంను శుద్ధి చేయడానికి తాము ఒప్పుకోమని ట్రంప్ చెబుతున్నారు. బట్ కండీషన్స్ అప్లై అంటున్నారు. ఇరాన్ మాత్రం ఒప్పుకోవడం లేదు. ఇరు దేశాల మధ్య చర్చలు విఫలం అవ్వడంతో ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులు చేస్తోంది. ఎప్పటికైనా ఇరాన్ తో తమకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని చెబుతోంది ఇజ్రాయెల్. అసలు నిజంగా ఇరాన్ అణుబాంబును తయారు చేయడానికి దగ్గరగా వచ్చిందా లేదా అది ఇరాన్ పై దాడి చేసి నాశనం చేయడానికి అమెరికా కల్పించిన ఊహ మాత్రమేనా? అనే డౌట్ వస్తోంది.

**సద్దాం హుస్సేన్‌కు పట్టిన గతే ఖమేనీకి పడుతుందా?**

ఇరాక్ ను నాశనం చేయడానికి అమెరికా ఇటువంటి ప్లాన్ నే అమలు చేసింది. అప్పటి సద్దాం హుస్సేన్ ప్రభుత్వం ప్రమాదకరమైన రసాయన, జీవ ఆయుధాలను నిల్వ చేసిందని, ఆ తర్వాత ఇరాక్‌పై దాడి జరిగిందని అమెరికా తెలిపింది. అయితే, ఇరాక్‌లో రసాయన ఆయుధాలకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు కనుగొనబడలేదు. ఇప్పుడు ఇరాన్ వంతు వచ్చింది. ట్రంప్ జాతీయ నిఘా డైరెక్టర్ తులసి గబ్బర్డ్ కాంగ్రెస్‌కు ఇరాన్ అణు బాంబును నిర్మించే దిశగా ముందుకు సాగడం లేదని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయడం లేదని...సుప్రీం లీడర్ ఖమేనీ 2003లో నిలిపివేసిన అణ్వాయుధ కార్యక్రమానికి అధికారం ఇవ్వలేదని నిఘా వర్గాలు అంచనా వేస్తూనే ఉన్నాయని అన్నారు.ఇరాన్ అణు బాంబు గురించి అమెరికా , ఇజ్రాయెల్ సిద్ధాంతాన్ని అణుశక్తి కోసం పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ అయిన ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (IAEA) అధిపతి రాఫెల్ గ్రాస్సీ కూడా తిరస్కరించారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తోందని చూపించే ఎటువంటి ఆధారాలు తమ వద్ద లేవని ఆయన అన్నారు.

**ఆ మూడు నెలలు రావడం లేదు**

ఇరాన్ పై దాడి జరుగుతున్న సమయంలో, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు 1996 నుంచి ఇరాన్ అణు బాంబును తయారు చేయడానికి దగ్గరగా ఉందని ఎలా చెబుతున్నారో చూపించే వీడియో ఒకటి బయటపెట్టారు. అణ్వాయుధాలను తయారు చేయడానికి దగ్గరగా వచ్చిందని చెప్పారు. సెప్టెంబర్ 2012 నాటి ఒక వీడియోలో, ఇరాన్ వచ్చే వసంతకాలం నాటికి అణ్వాయుధాలను సమకూర్చుకుంటుందని ఆ తర్వాత, కొన్ని నెలల్లో లేదా కొన్ని వారాల్లో అణ్వాయుధాలను పొందుతుందని ఆయన చెప్పారు.మార్చి 2015 నాటి వీడియో క్లిప్‌లో నెతన్యాహు కొన్ని వారాల్లోనే ఇరాన్ అణు బాంబును తయారు చేయడానికి తగినంత యురేనియంను సమకూర్చుకుందని చెప్పారు. ఆ సంవత్సరం అక్టోబర్‌లో, ఇరాన్ అణు బాంబును తయారు చేయడానికి కేవలం ఒక వారం మాత్రమే ఉందని నెతన్యాహు మళ్ళీ పునరుద్ఘాటించారు. దాదాపు మూడు దశాబ్దాల నుంచి ఇరాన్ మూడు నెలల్లో అణుబాంబు తయారు చేస్తుందని నెతన్యాహు చెబుతూనే ఉన్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ మూడు నెలలు రావడం లేదు. నెతన్యాహు మొత్తం ఎజెండా దేశ, ప్రాంతీయ భద్రతను కాపాడుకోవడమే. తనను సవాలు చేయగల ఏ దేశాన్ని కూడా ఆయన ఎదగనివ్వరు.

**ఇజ్రాయెల్‌కు అన్నీ తెలుసు**

ఇరాన్ కు అణు బాంబు తయారు చేసే సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ కు బాగా తెలుసునని, ఇరాన్ ను బలహీనపరిచేందుకే ఈ దాడి చేసిందని నిపుణులు అంటున్నారు. ఈ దాడి ఆకస్మిక దాడి కాదు, కానీ ఇజ్రాయెల్ దీనికి కొన్నేళ్ల నుంచి ప్రిపేర్ అయ్యింది.

**యుద్ధం డబ్బు కోసమేనా?**

అమెరికా, ఇజ్రాయెల్ కు యుద్ధం అనివార్యం. ఎందుకంటే యూరోపియన్ దేశాలు సంఘర్షణల నుండి డబ్బు సంపాదించుకోవచ్చు. అందుకే ఆ రెండు దేశాలకు యుద్ధం చాలా ముఖ్యం యుద్ధం తర్వాత ఏమి జరుగుతుందో వారు పట్టించుకోరు. ప్రజలు చనిపోవడం, దేశాలు నాశనం కావడం వారికి కావాల్సింది వ్యాపారం మాత్రమే. దేశాలు నాశనమైనా వారు పట్టించుకోరు.

### అణ్వాయుధాలకు సంబంధించి ఖమేనీ ఫత్వా ఏమిటి?

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ అణ్వాయుధాలను వ్యతిరేకించారు. 1990లలో ఆయన అణ్వాయుధాలకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేశారు. 2003లో, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయదని లేదా వాటిని నిల్వ చేయదని, ఉపయోగించదని ఆయన మళ్ళీ బహిరంగంగా ప్రకటించారు. ఖమేనీ అణ్వాయుధాలు ఇస్లామిక్ సూత్రాలకు విరుద్ధమని అభివర్ణించారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్ యొక్క ఉన్నత దళం ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సీనియర్ కమాండర్లు ఖమేనీ తన ఫత్వాను ఉపసంహరించుకోవాలని కోరారు. అమెరికా, పాశ్చాత్య ప్రత్యర్థుల నుండి ఒత్తిడి పెరుగుతోందని అటువంటి పరిస్థితిలో ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటం అవసరమని చెప్పారు.

### ఇరాక్ సిచ్యుయేషన్ ఇరాన్‌లో..

అమెరికా 2003 మార్చి 20న ఇరాక్‌పై దాడి చేసింది. ఇరాక్ వద్ద సామూహిక విధ్వంసక ఆయుధాలు అంటే రసాయన , జీవ ఆయుధాలు ఉన్నాయని , అది అణు బాంబును తయారు చేసే దిశగా కూడా అడుగులు వేస్తోందని అమెరికా, బ్రిటన్ ప్రపంచాన్ని నమ్మించాయి. మే నాటికి ఇరాకీ సైన్యం ఓడిపోయింది. ఆ దేశ పాలకుడు సద్దాం హుస్సేన్‌ను సింహాసనాన్ని తొలగించి ఉరితీశారు. అమెరికా ఇరాక్‌పై దాడి చేయడానికి గల కారణాలకు ఇరాక్‌లో ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఈ యుద్ధం అమెరికా నిఘా విశ్వసనీయతపై ప్రశ్నలను లేవనెత్తింది. తరువాత జరిగిన దర్యాప్తులో అమెరికా , బ్రిటిష్ నిఘా విభాగాల్లో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయి. ఇరాక్‌పై సామూహిక విధ్వంసక ఆయుధాలతో దాడి చేసిన కేసును రాజకీయ నాయకులు అతిశయోక్తి చేసి, రాజకీయం చేశారని పరిశోధనలో తేలింది. ఇప్పుడు అదే కథ ఇరాన్‌లో పునరావృతమవుతోంది .అణ్వాయుధాల బూచిని చూపిస్తూ దానిపై దాడులకు పాల్పడుతోంది.



# ఉత్తరకొరియాపై అమెరికా అణుదాడి చేస్తుంది:సియోక్

**టీపీఎన్ ప్రతినిధి |**

ఉత్తర కొరియా అణ్వాయుధ దాడి చేస్తే అమెరికా ప్రతీకారం తీర్చుకుంటుందని దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ సర్వీస్ డైరెక్టర్ లీ జోంగ్‌సియోక్ తెలిపారు. ఆ దేశంపై అణుదాడి చేస్తుందని చెప్పారు. నార్త్ కొరియా కొన్నాళ్లుగా అణు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అణ్వాయుధాలను తయారు చేయడానికి అవసరమైన ఫిస్సైల్ పదార్థాన్ని సేకరించిందని అనుమానిస్తున్నారు. అయితే అణ్వాయుధాలను అమర్చిన క్షిపణి పరీక్ష మాత్రం నిర్వహించలేదు. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులను ఉత్తర కొరియా సమకూర్చుకుంది. నార్త్ కొరియా సౌత్ కొరియాపై అణు దాడి చేస్తే ఆ పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తలు ఎక్కువగా ఉన్న సమయంలో కిమ్ నిరంతరం సైనిక శక్తిని ప్రదర్శించడం మరింత ఆందోళన నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేని విధంగా ఉంది. రష్యా..ఉక్రెయిన్, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య వార్ కంటిన్యూ అవుతూనే ఉంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మూడో ప్రపంచ యుద్ధం వస్తోందోనని భయాందోళన చెందుతున్నారు ప్రజలు. పశ్చిమాసిలో శాంతి నెలకొల్పేందుకు పలు దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అయినా రెండు దేశాల నేతల వెనక్కి తగ్గడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కొరియా ద్వీపకల్పంలో మరోసారి యుద్ధవాతావరణం తలెత్తితే ఊహించుకోవడానికే భయానకంగా ఉంటుంది. అమెరికా పెద్దన్న పాత్ర పోషించి యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటున్నారు పలువురు నిపుణులు.

# అమెరికాకు రష్యా వార్నింగ్!

**టీపీఎన్ ప్రతినిధి |**



అమెరికాకు రష్యా వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. ఇజ్రాయేల్‌కు అమెరికా సైనిక సహాయం చేస్తే పరిస్థితి మరింత దిగజారుతుందని రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమాలను ఆపేందుకే దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ చెబుతోంది. ఇరాన్ యురేనియం శుద్ధి కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడి చేసింది. ఇజ్రాయేల్‌కు మద్దతుగా అమెరికా సైన్యం రంగంలోకి దిగనుందనే ప్రచారం జరుగుతోంది. ఇజ్రాయేల్‌కు నేరుగా సైనిక సహాయం అందించవద్దని అమెరికాను హెచ్చరించారు. ఇరాన్‌కు మద్దతు ఇస్తోన్న రష్యా.. ఇజ్రాయేల్ దాడులను ఖండించింది.

**యుద్ధంతో భీకర వాతావరణం**

మరోవైపు, ఇరాన్, ఇజ్రాయేల్ పరస్పరం ఒకరిపై ఒకరు మిస్సైళ్లు, డ్రోన్ల దాడులతో పశ్చిమాసియా రగులుతోంది. తమ దాడులకు ఇరాన్ అణ్వాయుధ ప్రణాళికలను ఆపేందుకేనంటూ ఇజ్రాయెల్ చెబుతోంది. ఇరాన్ యురేనియం శుద్ధి కేంద్రాలను ధ్వంసం చేసింది. టెహ్రాన్ అణు బాంబులు తయారు చేయకుండా అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే అరాక్ హెవీ వాటర్ రియాక్టర్ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయేల్ డిఫెన్స్ ఫోర్సెస్ హెచ్చరించింది. ఆ వెంటనే ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇజ్రాయెల్ అరాక్ హెవీ వాటర్ రియాక్టర్ ప్లాంట్ ఉపగ్రహ ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. రియాక్టర్ దగ్గరలో ఉన్న ప్రజలు వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించింది. ఈ పోస్ట్ చేసిన కొన్ని గంటలకే ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది.

**ఇరాన్ యురేనియం కేంద్రాలపై దాడులు**

ఇరాన్ అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడమే ఇజ్రాయెల్ లక్ష్యంగా పెట్టుకుంది. అందుకే యురేనియం శుద్ధి కేంద్రాలపై దాడులు చేస్తోంది. టెహ్రాన్ అణుబాంబులు తయారు చేసేందుకు వాడుతున్న అన్ని వనరులను నాశనం చేయాలని ఇజ్రాయెల్ చూస్తోంది. ఐడీఎఫ్ దాడులతో ఇరాన్ అణు కార్యక్రమానికి ఆటంకం కలుగుతోంది. అటు, ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అమెరికాను హెచ్చరించారు. ఇరాన్‌తో యుద్ధం కారణంగా ఇజ్రాయేల్ భారీగానే నష్టపోతుంది. రోజుకు 2 వేల 400 కోట్లు ఖర్చుచేస్తోంది.



## కొత్త ఇంటికి రాహుల్ గాంధీ!

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ త్వరలో కొత్త ఇంటికి మారబోతున్నారు. ఢిల్లీలోని సున్ హరీ బాగ్ రోడ్డులోని బంగ్లా నంబర్ 5 ఇకపై ఆయన కొత్త అడ్రస్ గా మారనుంది. తన బర్త్ డే సందర్భంగా సామాన్ల తరలింపు ప్రక్రియ ప్రారంభమైనట్టు తెలుస్తోంది. జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సామావేశాల ప్రారంభానికి ముందే ఆయన ఈ బంగ్లాకు మారతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తన అధికారిక నివాసంగా ఈ బంగ్లా నంబర్ 5ను రాహుల్ గాంధీ ఓకే చెప్పినట్టు సమాచారం. గతేడాది లోక్ సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నిక కావడంతో ఆయనకు కేబినెట్ మంత్రి హోదా దక్కడంతో టైప్ 8 బంగ్లాకు అర్హులయ్యారు.



## పరిహారంపై పెను సవాళ్లు!

ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి బీమా పరిష్కారాల్లో ఇన్స్యూరెన్స్ కంపెనీలకు పెను సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ ప్రమాదంలో కుటుంబ సభ్యులు అందరూ ప్రాణాలు కోల్పోయినా ఉదంతాల్లో బీమా క్లెయిమ్ లు ఎవరికి చెల్లించాలనే ప్రశలు తలెత్తుతోంది. పాలసీదారు, నామినీలుగా భార్యాభకర్తలు ఉంది..వారిద్దరూ మరణించి ఉంటే క్లెయిమ్ ల పరిష్కార ప్రక్రియ చాలా క్లిష్టంగా మారింది. ఇప్పటి వరకు ఏడు క్లెయిమ్ లను అందుకుంటే వాటిలో పాలసీదారు, నామినీ ఇద్దరూ చనిపోయిన క్లెయిమ్ ఒకటి ఉందని టాటా ఏఐఏ అధికారులు తెలిపారు. ఇలాంటి కేసుల్లో మృతుల వారసులకు పరిహారాన్ని అందించేలా ప్రత్యేక సడలింపులు తీసుకువచ్చినట్టు తెలిపారు. వారసులు ఒకరి కంటే ఎక్కువ మంది ఉంటే వారు పరిహారాన్ని ఎలా పంచుకోవాలి అన్న దానిపై డిక్లరేషన్ తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి కేసుల్లో ఎల్ఐసీ, ది న్యూ ఇండియా అస్యూరెన్స్ తదితర సంస్థలూ పరిహార చెల్లింపు మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఎయిరిండియా బోయింగ్ డ్రీమ్ లైనర్ ఇన్సూరెన్స్ కవర్ ను సంస్థ రూ. 750 కోట్ల నుంచి రూ. 850 కోట్లకు పెంచింది.




## జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు నిజమే : ప్యానెల్ నివేదిక

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వర్మ ఇంట్లో డబ్బు బయటపడిన మాట వాస్తవమే అని ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ నిర్ధారించింది. దీనిపై ప్యానెల్ 60 పేజల నివేదిక అందజేసింది. ఇందులో 30 తుగ్లక్ క్రిసెంట్ రోడ్డులోని న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్నిప్రమాద సమయంలో నోట్ల కట్టలు గుర్తించడం వాస్తవమేనని పేర్కొంది. ఫైర్ యాక్సిడెంట్ లో దగ్ధమైన నోట్లను మార్చి 15న తెల్లవారు జామున అక్కడి నుంచి తొలగించడమే బలమైన సాక్ష్యమని తెలిపారు. తమకు లభించిన ఎలక్ట్రానిక్, ప్రత్యక్ష ఆధారాలను దృష్టిలో ఉంచుకొని సీజేఐ ఆరోపణలు నిజమేనని నివేదిక పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు జస్టిస్ గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగిచేందుకు ఈ ఆధారాలు సరిపోతాయని అభిప్రాయపడింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో పెద్ద సంఖ్యలో కాలిపోయిన నోట్ల కట్టలను గుర్తించారు.

# ఏఐతో అద్భుతాలు :నారాయణమూర్తి

**టీపీఎన్ ప్రతినిధి |**





ఏఐ టెక్నాలజీ వచ్చాక ఐటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. కంపెనీలు అధిక లాభాలను ఆర్జిస్తున్నాయి. అటు యాజమానులు ఫుల్ ఖుషీగా ఉన్నారు. అయితే ఉద్యోగుల్లో మాత్రం టెన్షన్ స్టార్ట్ అయ్యింది. పెద్ద కంపెనీలు వందలు..వేలల్లో లే ఆఫ్స్ పేరుతో ఎంప్లాయిస్ ను తీసివేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఐటీ ఉద్యోగులు. ఈ క్రమంలో ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణమూర్తి మాత్రం అవన్నీ కొట్టిపారేస్తున్నారు. ఓపెన్ ఏఐ జనరేటివ్, ఏఐ టూల్ చాట్ జీపీటీని ఉపయోగించడం వల్ల తన ఉత్పాదకత ఐదు రెట్లు పెరిగిందని తెలిపారు. లేటెస్ట్ టెక్నాలజీ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుందనే భయాన్ని వదిలివేయాలని సూచించారు. ఇది మరో రకమైన ఉద్యోగాన్ని సృష్టిస్తుందని తెలిపారు.

**ఏఐతో కొత్త ఉద్యోగాలు**

చాట్ జీపీటీ వంటి ఏఐ టూల్‌ను చాలా మంది వినియోగిస్తున్నారు. ఏఐ చాలా ఉద్యోగాలకు సవాల్‌గా మారుతుందనే అభిప్రాయాలున్నాయి. ఖర్చును తగ్గించుకునేందుకు కొన్ని కంపెనీలు లే ఆఫ్స్ కూడా ప్రకటిస్తున్నాయి. లక్షల్లో ఉద్యోగాలు కూడా గాల్లో దీపంలా మారిపోయాయి. ఈ క్రమంలో నారాయణమూర్తి ఓ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏఐ ఉత్పాదకతను పెంచుతుందన్నారు. తన స్పీచ్‌లకు చాట్ జీపీటీను వాడుతున్నట్లు చెప్పారు. అయితే ఏఐను సరైన ప్రశ్న అడగడంలోనే అసలు తెలివితేటలు ఉన్నాయన్నారు.

కృత్రిమ మేధ ఐటీ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తుందని చెప్పారు నారాయణమూర్తి. ఈ విషయంలో తాను సానుకూలగా ఉన్నానని పేర్కొన్నారు. ఏఐను సపోర్ట్‌గా ఉపయోగించి ఉత్పాదకత, నాణ్యతను ఎలా మెరుగుపర్చుకోవాలో తెలిస్తే సాఫ్ట్ వేర్ రంగం వృద్ధి వేగంగా పెరుగుతుందన్నారు. భారత ఐటీ పరిశ్రమలో వృద్ధి, ఉద్యోగ నియామకాలు మందకొడిగా సాగుతున్న నేపథ్యంలో మూర్తి వ్యాఖ్యలు ప్రాధాన్యం నెలకొంది.







# యుద్ధభయాలు.. షేర్లను తెగనమ్మిన ఇన్వెస్టర్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం రక్తమోడాయి. బెంచ్‌మార్క్ సూచీలు మినహా అన్ని రంగాల సూచీలు విలవిల్లాడాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం, వెస్ట్ ఏషియాలో యుద్ధం మరింత తీవ్రమవుతుండటం, ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరగడం ఇందుకు కారణాలు. మరోవైపు ట్రంప్ టారిఫ్స్ వల్ల మున్ముందు ద్రవ్యోల్బణం మరింత పెరుగుతుందని యూఎస్ ఫెడ్ ఛైర్ జెరోమ్ పావెల్ అంచనా వేయడం అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. ఇన్వెస్టర్లు షేర్లను తెగనమ్మడంతో ఆటో మినహా అన్ని రంగాల సూచీలు పతనమయ్యాయి. రేంజుబౌండ్లో చలించడంతో సెన్సెక్స్ 82, నిఫ్టీ 18 పాయింట్ల మేర ఎరుపెక్కాయి.

క్రితం సెషన్లో 81,444 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ గురువారం 81,403 వద్ద మొదలైంది. 81,191 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 81,583 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 82 పాయింట్ల నష్టంతో 81,361 వద్ద ముగిసింది. 24,803 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 24,733 వద్ద కనిష్ఠ, 24,863 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 18 పాయింట్లు తగ్గి 24,793 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 251 పాయింట్లు తగ్గి 55,577 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ50లో 22 కంపెనీలు లాభపడగా 28 నష్టపోయాయి. టాటా కన్జూమర్, ఐచర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, డాక్టర్ రెడ్డీస్ టాప్ గెయినర్స్. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, అదానీ ఎంటర్ ప్రైజెస్ అత్యధికంగా నష్టపోయాయి. నేడు ఆటో మినహా అన్ని రంగాల సూచీలు ఎరుపెక్కాయి. పీఎస్‌యూ బ్యాంకు, మీడియా, రియాల్టి, ఫైనాన్స్, డిఫెన్స్, మెటల్, ఎనర్జీ, వినియోగ సూచీలు విలవిల్లాడాయి.

ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ పూర్తిగా బేర్స్‌కు అనుకూలంగా మారింది. మొత్తం 2954 స్టాక్స్ ట్రేడవ్వగా 516 మాత్రమే లాభపడ్డాయి. 2363 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 35 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 43 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 46, లోయర్ సర్క్యూటును 107 చేరాయి.

బోనస్ షేర్ల జారీపై నెస్లే ఇండియా జూన్ 26న నిర్ణయం తీసుకోనుంది. హెచ్‌డీఎఫ్‌సీ ఫైనాన్స్ అనుబంధ కంపెనీ హెచ్‌డీబీ ఫైనాన్స్ జూన్ 25న ఐపీవోకు రానుందని తెలిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి 0.3% తగ్గి 86.72 వద్ద స్థిరపడింది. మహీంద్రా లైఫ్ స్పేస్‌లో ఎం అండ్ ఎం తన వాటాను 52.43 శాతానికి పెంచుకుంది. రెండో రోజు మధ్యాహ్నానికి ఏరిస్ ఇన్ఫ్రా సొల్యూషన్స్ ఐపీవో 88% మేర సబ్‌స్క్రైబ్ అయింది. ఏఐ సంబంధిత మార్పుల కోసం జస్ట్ ఎనర్జీతో హెచ్‌సీఎల్ టెక్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. గయానా ప్రభుత్వం నుంచి అశోకా బిల్‌డ్‌కాన్ 67.2 మిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్ గెలుచుకుంది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్లపై ఇజ్రాయెల్ దాడులు పెంచడంతో ముడిచమురు ధరలు మరింత భగ్గుమన్నాయి. కొన్ని మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.58000 కోట్ల నగదు స్తబ్ధుగా ఉన్నట్టు తెలిసింది. మొత్తం ఇండస్ట్రీలో ఈ విలువ 30 శాతంగా ఉండటం గమనార్హం.

**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**




# పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణంతో పసిడి పరుగులు!

**టీపీఎన్ ప్రతినిధి |**

ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పసిడి పరుగులకు ఎప్పుడు బ్రేక్ పడుతుందో తెలియడం లేదు. ఇటీవల కాలంలో బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గత వారం రోజులుగా లక్ష మార్క్‌ను క్రాస్ చేసిన ధరలు సామాన్యులకు అందని ద్రాక్షగా మారాయి. ఈ క్రమంలో మరోసారి గోల్డ్ రేట్స్ స్వల్పంగా పెరిగాయి. 22 క్యారెట్ల బంగారం ధర రూ.92 వేల 650 ఉండగా..24 క్యారెట్ల బంగారం ధర లక్షా 1,080 రూపాయల ధర పలుకుతోంది. ఇక అటు వెండి ధర రూ.1000 పెరిగి కిలో 1, 22,000కు చేరుకుంది.




# ఓలా డ్రైవర్లకు గుడ్ న్యూస్!

**టీపీఎన్ ప్రతినిధి |**

దేశంలో ఓలా క్యాబ్స్ విజయవంతంగా నడుస్తున్నాయి. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ముందువరుసలో ఉన్నాయి. క్యాబ్ బుక్ చేసుకోవడమే ఆలస్యం వెంటనే వచ్చి వాలిపోతాయి. అందుకే తక్కువ కాలంలోనే మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు సరికొత్త ఫీచర్ తో ముందుకు వచ్చింది. డ్రైవర్లు తమ సంపాదనలో వందశాతం పొందేలా వీలు కల్పించింది. ఈ సదుపాయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. అంతేకాదు డ్రైవర్లకు మంచి సంపాదన లభిస్తుందని చెప్పింది.

**జీరో కమిషన్ మోడల్**

దేశవ్యాప్తంగా జీరో కమీషన్ మోడల్‌ను అమలు చేస్తున్నట్లు ఓలా క్యాబ్స్ తెలిపింది. 10 లక్షలకు పైగా డ్రైవర్ భాగస్వాములు తమ సంపాదనలో 100 శాతం ఆదా చేసుకోవచ్చని చెప్పింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న ఈ కార్యక్రమం ఆటోలు, బైకులు, క్యాబ్ డ్రైవర్లకు బిగ్ రిలీఫ్ అవుతుందని పేర్కొంది. రైడ్ పరిమాణం, ఆదాయంపై ఎటువంటి పరిమితులను ఉండవని స్పష్టం చేసింది. కమీషన్ రూపంలో ఓలాకు వెళ్లే ఛార్జీలను ఎటువంటి మినహాయింపులు లేకుండా డ్రైవర్లు ఆ మొత్తాన్ని పొందవచ్చు. అయితే అందుకు నెలవారీ సబ్‌స్క్రిప్షన్ పొందాలని కంపెనీ తెలిపింది. ఈ ఫీచర్ ను ఉపయోగించుకునే డ్రైవర్లు 30 రోజుల పాటు రోజుకు 67 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. అంటే నెలకు రూ.2,010 అవుతుంది.

**ఛార్జీలపై పరిమితులు లేవు**

ఈ ఫీచర్‌తో డ్రైవర్లు జీరో కమీషన్ క్లెయిమ్ చేసుకునే ఛార్జీలపై ఎలాంటి పరిమితులు లేవని, తమ ఛార్జీల మొత్తాన్ని క్లెయిమ్ చేసేటప్పుడు వాహనం ఎంపికపై కంపెనీ ఎలాంటి ఆంక్షలు విధించదని తెలిపింది. ఈ ఫీచర్ ఓలా ఆటో, ఓలా బైక్స్, ఓలా క్యాబ్‌స్‌కు అందుబాటులో ఉంది. కమీషన్లను తొలగించడం వల్ల డ్రైవర్లకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఓలా తెలిపింది. ఈ మార్పు వల్ల డ్రైవర్ ఆదాయం ఏటా రూ. లక్షా 36 వేలు పెరుగుతుందని, ప్రస్తుత స్థాయిలతో పోలిస్తే ఇది 30 శాతం అధికమని చెప్పింది.

# కస్టమర్లకు మారుతీ బంపర్ ఆఫర్

**టీపీఎన్ ప్రతినిధి |**

పెరుగుతున్న కాంపిటీషన్ ను తట్టుకుని నిలబడేందుకు మారుతి సుజుకీ ఎప్పటికప్పుడు తన మార్కెట్ విస్తరిస్తూనే ఉంది. మధ్య తరగతి ప్రజలు ఆకర్షితులయ్యేలా అదిరిపోయే ఆఫర్లు అందిస్తుంది. ఈ క్రమంలో తన ప్రాబల్యాన్ని చాటుకుటుంది. కార్ల మార్కెట్ లో మారుతీకి మంచి డిమాండ్ ఉంది. ఆటో మొబైల్స్ రంగంలో రారాజుగా వెలుగొందుతున్న మారుతి సుజుకీ తమ కస్టమర్లకు ఈజీగా వెహికిల్స్ అందిచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. వాహన రుణాల సదుపాయాన్ని అందిచేందుకు ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుతో టై అప్ అయ్యింది. కొత్త కార్లు, యూజ్డ్ కార్లు, వాణిజ్య వెహికిల్స్ కి రిటైల్ రుణాల కోసం ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని మారుతీ సుజుకీ తెలిపింది. కస్టమర్లకు మరింత చేరువ అయ్యేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంది.






# మహిళల వన్డే వరల్డ్ కప్.. పూర్తి షెడ్యూల్..

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ కంప్లీట్ అవ్వడమే లేట్.. మరో మెగా టోర్నీ రెడీ అవుతుంది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ ను రిలీజ్ చేసింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ సెప్టెంబర్ 30న షురూ కానుంది. టీమిండియా, పాకిస్థాన్ మ్యాచ్ అక్టోబర్ 5న జరుగనుంది. పహల్గాం ఉగ్రదాడి.. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిణామాల నేపథ్యంలో పాక్ మ్యాచ్ లకు శ్రీలంక వేదిక కానుందని ఐసీసీ పేర్కొంది. కొలంబోలో ఏకంగా 11 లీగ్ మ్యాచ్‌లకు ఐసీసీ ఆమోదం తెలిపింది. వరల్డ్ కప్ లో ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టనుంది. భారత్, శ్రీలంకలు ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నాయి. సెప్టెంబర్ 30 లంక, టీమిండియా పోరుతో మెగా టోర్నీ షురూ కానుంది. తర్వాత అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో ఆసీస్ తలపడనుంది. మొత్తంగా కొలంబోలో 11 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అక్టోబర్ 29న కొలంబో లేదా బెంగళూరులో ఫస్ట్ సెమీ ఫైనల్ జరుగనుండగా.. అక్టోబర్ 30న బెంగళూరులో రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ ఉండనుంది. ఇక షెడ్యూల్ చెక్ చేస్తే.. సెప్టెంబర్ 30 న భారత్ vs శ్రీలంక టీమ్స్ బెంగళూరులో ఆడనుంది.

ఇక అక్టోబర్ 1న ఆస్ట్రేలియా vs న్యూజిలాండ్ - ఇండోర్, అక్టోబర్ 2 న బంగ్లాదేశ్ vs పాకిస్థాన్ - కొలంబో, అక్టోబర్ 3 న ఇంగ్లండ్ vs దక్షిణాఫ్రికా - బెంగళూరు, అక్టోబర్ 4 న ఆస్ట్రేలియా vs శ్రీలంక - కొలంబో, అక్టోబర్ 5 న భారత్ vs పాకిస్థాన్ - కొలంబో, అక్టోబర్ 6 న న్యూజిలాండ్ vs దక్షిణాఫ్రికా ఇండోర్, అక్టోబర్ 7 న ఇంగ్లండ్ vs బంగ్లాదేశ్ - గువాహటి, అక్టోబర్ 8 న ఆస్ట్రేలియా vs పాకిస్థాన్ - కొలంబో, అక్టోబర్ 9 న భారత్ vs దక్షిణాఫ్రికా - వైజాగ్, అక్టోబర్ 10 న న్యూజిలాండ్ vs బంగ్లాదేశ్ - వైజాగ్, అక్టోబర్ 11 న ఇంగ్లండ్ vs శ్రీలంక - గువాహటి, అక్టోబర్ 12 న భారత్ vs ఆస్ట్రేలియా - వైజాగ్, అక్టోబర్ 13 న దక్షిణాఫ్రికా vs బంగ్లాదేశ్ వైజాగ్, అక్టోబర్ 14 న న్యూజిలాండ్ vs శ్రీలంక - కొలంబో, అక్టోబర్ 15 న ఇంగ్లండ్ vs పాకిస్థాన్ - కొలంబో, అక్టోబర్ 16 న ఆస్ట్రేలియా vs బంగ్లాదేశ్ - వైజాగ్, అక్టోబర్ 17 న దక్షిణాఫ్రికా vs శ్రీలంక - కొలంబో, అక్టోబర్ 18 న న్యూజిలాండ్ vs పాకిస్థాన్ - కొలంబో, అక్టోబర్ 19 న భారత్ vs ఇంగ్లండ్ - ఇండోర్, అక్టోబర్ 20 న శ్రీలంక vs బంగ్లాదేశ్ - కొలంబో, అక్టోబర్ 21 న దక్షిణాఫ్రికా vs పాకిస్తాన్ - కొలంబో, అక్టోబర్ 22 న ఆస్ట్రేలియా vs ఇంగ్లండ్ - ఇండోర్, అక్టోబర్ 23 న భారత్ vs న్యూజిలాండ్ - గువాహటి, అక్టోబర్ 24 న పాకిస్థాన్ vs శ్రీలంక - కొలంబో, అక్టోబర్ 25 న ఆస్ట్రేలియా vs శ్రీలంక - ఇండోర్, అక్టోబర్ 26 - ఇంగ్లండ్ vs న్యూజిలాండ్ - గువాహటి, అక్టోబర్ 26 న భారత్ vs బంగ్లాదేశ్ బెంగళూరు, అక్టోబర్ 29 న సెమీ ఫైనల్ - గువాహటి /కొలంబో, అక్టోబర్ 30 న సెమీ ఫైనల్ 2 బెంగళూరు, నవంబర్ 2 న ఫైనల్ - కొలంబో/ బెంగళూరు లో జరగనుంది.

## నన్ను రిటైర్ అవ్వమన్నాడు: కరుణ్ నాయర్



ఇండియన్ టీమ్‌లో ప్లేస్ దక్కించుకోవడం కంటే.. రీఎంట్రీ ఇవ్వడం చాలా కష్టం. ఎందుకంటే ఎక్కువగా ఫెయిల్ అయిన క్రికెటర్సే టీమ్ కు దూరమవుతారు. వాళ్ల మీద ఫెయిల్యూర్ స్టాంప్ పడిపోతుంది. అలాంటి వాళ్లు తిరిగి టీమిండియాలోకి కమ్ బ్యాక్ ఇవ్వడం అంత ఈజీ కాదు. బెస్ట్ పెర్ఫార్మెన్స్‌లు ఇస్తూ చాన్నాళ్ల పాటు వెయిట్ చేయక తప్పదు. టఫ్ కాంపిటేషన్ ను తట్టుకొని అద్భుతంగా రాణించగలగాలి. దీనికి తోడు అదృష్టం కూడా తోడవ్వాలి లేదంటే రీఎంట్రీ కష్టమే. వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ విషయంలోనూ ఇదే జరిగింది. ట్రిపుల్ సెంచరీ కొట్టాక టీమిండియాకు దూరమైన అతడు.. ఎట్టకేలకు 8 ఏళ్ల తర్వాత ఇంగ్లండ్ సిరీస్‌తో కమ్‌బ్యాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ తరుణంలో ఓ భారత స్టార్ తనను రిటైర్ అవ్వమన్నాడంటూ అతడు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. ఓ టీమిండియా క్రికెటర్ నన్ను పిలిచాడు. నువ్వు రిటైర్ అయిపో అని సలహా ఇచ్చాడు. ప్రపంచవ్యాప్తంగా అనేక క్రికెట్ లీగ్స్ జరుగుతున్నాయి. కాబట్టి రిటైర్ అయ్యాక వాటిల్లో ఆడితే నీకు బాగా డబ్బు వస్తుందని సూచించాడు అని కరుణ్ నాయర్ రివీల్ చేశాడు. ఆ క్రికెటర్ సలహా విని రిటైర్‌మెంట్ తీసుకోవడం పెద్ద విషయం కాదని.. కానీ తనకు డబ్బుల కంటే సవాళ్లను ఎదుర్కోవడమే చాలా ఇష్టమని చెప్పుకొచ్చాడు. ఎప్పటికైనా భారత జట్టుకు తిరిగి ఆడాలనే కోరికతోనే ఇన్నాళ్లూ దేశవాళీ క్రికెట్‌లో కొనసాగానని నాయర్ పేర్కొన్నాడు. రీఎంట్రీ ఇస్తాననే నమ్మకం తనకు ఉందని.. అందుకోసం తీవ్రంగా శ్రమించానని కరుణ్ నాయర్ తెలిపాడు. కష్టం వృథా పోలేదని, తాను అనుకున్నట్లే తిరిగి రీఎంట్రీ ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నాడు. కాగా, ఆ క్రికెటర్ తనను రిటైర్ అవ్వమన్నాడంటూ కరుణ్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే అతడు పేరు బయటపెట్టకపోవడంతో నాయర్‌ను రిటైర్ అవ్వమని చెప్పిన ఆ భారత స్టార్ ఎవరై ఉంటారా? అని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

## ఆ టీమ్ కు సంజూ శాంసన్ గుడ్ బై చెప్పారా..?

ఐపీఎల్ లో అద్భుతమైన ఇన్నింగ్స్ తో క్రికెట్ లవర్స్ ను ఎంటర్ టైన్ చేసే సంజూ శాంసన్ తన సారథ్యంలో రాజస్థాన్ రాయల్స్ టీమ్ కు ట్రోఫీ అందించాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. కానీ, అతడి కల నిజం కావడం లేదు. దాంతో జెర్సీ మారిస్తేనే లక్ మారుతుందని అనుకుంటున్నారు. ఇన్నాళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న రాజస్థాన్ జట్టును వీడేందుకు రెడీ అవుతున్నారు. ఈమధ్య అతడు తన సోషల్ మీడియాలో పెడుతున్న పోస్ట్ లు అందుకు బలం చేకూరుస్తున్నాయి. ఇంతకూ సంజూ ఏ ఫ్రాంచైజీ గూటికి చేరనున్నాడో తెలుసా.. చెన్నై సూపర్ కింగ్స్. ఇంటర్నెట్‌లో సంజూ రిలీజ్‌డ్.. సీఎస్కే రెడీ అంటూ ధోనీ, శాంసన్ నవ్వుతూ ఉన్న పోస్ట్‌లు వైరలవుతున్నాయి. ఆ పోస్ట్‌లు చూసినవాళ్లంతా శాంసన్.. సీఎస్కే ఫ్రాంచైజీకి ఆడడం ఖాయం అని ఖుషీ అవుతున్నారు. ఐపీఎల్ హిట్టర్లలో ఒకడైన శాంసన్ 2021లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ గా సెలెక్ట్ అయ్యారు. అతడి కెప్టెన్సీలో రాజస్థాన్ 2022 ఎడిషన్‌లో ఫైనల్ చేరినా కప్ కొట్టలేకపోయింది. ఆ తర్వాత మాత్రం ప్లే ఆఫ్స్‌కు ముందే ఆ టీమ్ కథ ముగిస్తూవస్తోంది. 18వ సీజన్‌లోనూ అంతే. సీజన్ ఆరంభంలో గాయం కారణంగా కీలక మ్యాచ్‌లకు దూరమైన శాంసన్.. ఆఖర్లో టీమ్‌లోకి వచ్చాడు. కానీ, అప్పటికే రాజస్థాన్ ప్లే ఆఫ్స్ ఆశలు అడుగంటాయి. దాంతో, తీవ్ర నిరాశకు గురైన శాంసన్ 19వ సీజన్‌లో కొత్త జట్టుకు ఆడాలనే ఆలోచనతో ఉన్నట్టుగా తెలుస్తోంది. మరి దీనిపై ఇంకా ఎలాంటి క్లారిటీ రాలేదు.



## ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్.. స్మృతి మందానకు అగ్రస్థానం..!



వన్డే ప్రపంచకప్ ప్రారంభానికి ముందు భారత మహిళల క్రికెట్ జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) నుండి శుభవార్త అందింది. జూన్ 17, మంగళవారం నాడు విడుదల చేసిన తాజా మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో ఇండియా వైస్ కెప్టెన్ స్మృతి మందాన అగ్రస్థానాన్ని అధిరోహించింది. ఆమె 727 రేటింగ్ పాయింట్లతో తొలి స్థానాన్ని సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్‌ను వెనక్కునెట్టి స్మృతి తిరిగి అగ్రస్థానంలోకి రావడం విశేషం. 2019లో చివరిసారిగా మొదటి స్థానాన్ని సంపాదించిన స్మృతి, ఆరేళ్ల అనంతరం మళ్లీ అదే స్థాయిని అందుకోవడం గర్వకారణంగా మారింది. లారా వోల్వార్డ్ తన రేటింగ్ పాయింట్లలో సుమారు 8 పాయింట్లు కోల్పోవడంతో, స్మృతి ఆమెను మించి అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుతం లారా, ఇంగ్లాండ్ కెప్టెన్ నటాలి స్కివర్‌లు 719 పాయింట్లతో సంయుక్తంగా రెండవ స్థానంలో కొనసాగుతున్నారు. వోల్వార్డ్ మూడో స్థానానికి పరిమితమయ్యింది. ఇంగ్లాండ్ వికెట్‌కీపర్ జోన్స్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ అమీ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు. టాప్ 10లో నలుగురు ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఉండటం విశేషం. ఇటీవల ముగిసిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో స్మృతి అద్భుతంగా రాణించింది. ఆమె ఐదు మ్యాచ్‌లలో 52.80 సగటుతో మొత్తం 264 పరుగులు సాధించింది. స్ట్రైక్ రేట్ 90.41 ఉండటం విశేషం. ఇదే సమయంలో సఫారీ కెప్టెన్ వోల్వార్డ్ వెస్టిండీస్‌తో జరిగిన రెండు వన్డేల్లో కేవలం 27, 28 పరుగులే చేసి నిరాశ పరిచింది. ఇతర భారత బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ వరుసగా 14, 15 స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలర్ల విభాగంలో ఇంగ్లాండ్ స్పిన్నర్ సోఫీ ఎక్సన్ 747 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ నాలుగవ స్థానాన్ని ఆక్రమించింది. ఇటీవల కాలంలో భారత మహిళల జట్టు వన్డే, టీ20 ఫార్మాట్లలో శ్రేణిగా విజయాలను సాధిస్తోంది. ఆ విజయాల్లో ఓపెనర్‌గా బలమైన ఆరంభాన్ని ఇచ్చే స్మృతి పాత్ర కీలకంగా మారింది. ఆమె ఫామ్‌ను పరిశీలిస్తే, వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు నంబర్ వన్ ర్యాంక్ రావడం జట్టుకు భారీ ప్రోత్సాహాన్ని ఇస్తోంది.ఈ విజయంతో తన బాధ్యత మరింత పెరిగిందని స్మృతి పేర్కొంది. స్వదేశంలో జరగబోయే వన్డే వరల్డ్ కప్‌లో తన ప్రతిభను పూర్తి స్థాయిలో చూపిస్తానని ఆమె ఆత్మవిశ్వాసంగా వ్యక్తం చేసింది.



# ధనుష్‌తో కెమిస్ట్రీ గురించి రష్మిక ఇంట్రెస్టింగ్ కామెంట్స్..

నాగార్జున, ధనుష్, రష్మిక మెయిన్ క్యారెక్టర్స్ లో యాక్ట్ చేసిన లేటెస్ట్ సినిమా కుబేర. ఈ క్రేజీ మూవీ ఈ నెల 20న రిలీజ్ కాబోతుంది. సినిమా పై మంచి బజ్ ఉంది. పైగా ట్రైలర్ కూడా జనంలోకి బాగా కనెక్ట్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ లో రష్మిక మాట్లాడిన మాటలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. రష్మిక మాట్లాడుతూ.. నా సినీ ప్రయాణానికి సంబంధించిన వీడియో చూడగానే చాలా భయమేసింది. ఇన్ని రోల్స్ ప్లే చేశానా ? అనే ఆశ్చర్యం కలిగింది. సాధారణంగా ఒక సినిమా పూర్తవడానికి ఏడాది పడుతుంది. ఆ సమయంలో ఫిల్మ్ టీమ్ తో క్లోజ్ అవుతుంటాం. నేను నా ఫ్యామిలీని కలిసి ఏడాది అయింది అంటూ రష్మిక చెప్పింది. రష్మిక ఇంకా మాట్లాడుతూ.. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటించాలన్న కల ఈ సినిమాతో నెరవేరింది. రియల్ లొకేషన్స్‌లోనే ఆయన షూటింగ్ చేస్తారు. నాగార్జున సర్‌తో నేను నటించిన రెండో సినిమా ఇది. ఆయన మంచి నటుడే కాదు మంచి వ్యక్తి. ధనుష్‌తో కలిసి మరిన్ని సినిమాల్లో నటించాలనుంది. ఈ సినిమాలో మా కెమిస్ట్రీ ఆ అవకాశాలు అందిస్తుందనుకుంటున్నా అని రష్మిక తెలిపింది. మొత్తానికి ఈ సినిమాలో రష్మిక బలమైన పాత్రలో కనిపించిందట. ఆమె పాత్ర ఎమోషనల్ గానూ ఆకట్టుకుంటుందని ట్రైలర్ అండ్ పోస్టర్స్ చూస్తేనే అర్థమవుతుంది.

## సోషల్ మీడియాను షేక్ చేస్తున్న రాజా సాబ్ టీజర్..

# ప్రభాస్ ఫ్యాన్స్ ఆకలి తీరినట్లే..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నుండి మస్త్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ లో అద్భుతమైన స్టోరీ అండ్ స్క్రీన్ ప్లేతో రానున్న సినిమానే రాజా సాబ్. ఈ దెబ్బతో ప్రభాస్ ఫ్యాన్స్ కి ఆకలి తీరిపోయినట్లే. ఇన్నాళ్లు ప్రభాస్ ను ఎలా అయితే చూడాలి అనుకున్నామో అలాగే చూస్తుంటే రెండు కళ్లు చాలట్లేదు. అసలు టీజరే ఈ రేంజ్ లో ఉంటే.. ఇక ట్రైలర్ అండ్ మూవీ ఇంకే రేంజ్ లో ఉంటాయో ఊహించుకుంటేనే అద్భుతంగా ఉంది. నిజానికి మన మారుతి హారర్ కామెడీ తీయడంలో ఎక్స్ పర్ట్. అందులో డౌటే లేదు. ఇప్పుడు అలాంటి ఓ స్టోరీకి ప్రభాస్ లాంటి యాక్టర్ యాడ్ అయితే అసలు ఇంకేమైనా ఉందా.. నిజం చెప్పాలంటే ప్రభాస్, మారుతితో సినిమాని అనౌన్స్ చేసినప్పుడు వామ్మో.. ప్రభాస్ ఎందుకు రిస్క్ చేస్తున్నారు అనే కామెంట్స్ వినిపించాయి. ఆ తర్వాత ఫస్ట్ లుక్ కి ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ కూడా ఫిదా అయ్యారు. ఆ తర్వాత గ్లింప్స్ కి ఫ్యాన్ అయిపోయారు. ఇప్పుడు టీజర్ కి మతులు చెడుతున్నాయంటే డౌట్ లేదు. ఎప్పుడెప్పుడు ఈ సినిమాని థియేటర్ లో చూస్తామా తెగ ఎగ్జైట్ మెంట్ తో ఉన్నారు. మెయిన్ గా టీజర్ లో ప్రభాస్ ను వింటేజ్ లుక్ లో చూపించడంతో పాటూ హార్రర్ కామెడీ కథను మారుతి డీల్ చేసిన విధానం అందరినీ మెప్పించింది. సో సినిమా గురించి ఇక అనుమానాలు పెట్టుకోనక్కర్లేదు. రాజా సాబ్ కు సంబంధించిన అన్ని డౌట్లు తీరినట్టే. ఇక టీజర్ లాంచ్ ఈవెంట్ లో భాగంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు డైరెక్టర్ మారుతి సమాధానమిచ్చాడు. అందులో భాగంగానే ది రాజా సాబ్ సినిమా రన్ టైమ్ గురించి మాట్లాడాడు మారుతి. రాజా సాబ్ నిడివి మూడున్నర గంటలుంటుందని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచాడు మారుతి. ఈ సినిమాను హాలీవుడ్ కు తీసుకెళ్లాలనే ఉద్దేశం ఉందని, ఇంత రన్ టైమ్ అక్కడ వర్కవుట్ అవుతుందో లేదో చూడాలని, డిస్నీ లాంటి సినిమాలను మనం కూడా తీయగలమని రాజా సాబ్ ప్రూవ్ చేస్తుందని మారుతి అన్నాడు. తర్వాత మళ్లీ వెంటనే ఇందాక ఏదో ఫ్లో లో అన్నానని, రాజా సాబ్ సినిమా మూడు గంటలే ఉంటుందని క్లారిటీ ఇచ్చాడు మారుతి. అంటే అతను చెప్పినదాన్ని బట్టి రాజా సాబ్ రన్ టైమ్ ను మూడు గంటలకే కుదించే అవకాశముంది. అయినా సినిమా బావుండి, కంటెంట్ ఎంగేజింగ్ గా అనిపిస్తే రన్ టైమ్ ను ఆడియన్స్ పెద్దగా పట్టించుకోరు. కేవలం కంటెంట్ వీక్ గా ఉన్నప్పుడే రన్ టైమ్ సమస్యగా మారుతుంది. మూడు గంటలు అంటే ఎక్కువ రన్ టైమ్ ఏమీ కాదు కాబట్టి ఈ విషయంలో రాజా సాబ్ సేఫ్ అనే చెప్పుకోవాలి.




# రాజా సాబ్ కోసం నిధి అగర్వాల్ ఏం చేసిందంటే..?



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ లేటెస్ట్ మూవీ ది రాజాసాబ్ నుంచి టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ సినిమా పూర్తి హార్రర్ ఫాంటసీ మూవీగా ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు రెడీ అయింది. ఇక ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఈ మూవీలో ప్రభాస్ లుక్స్ అండ్ ఎక్స్ ప్రెషన్స్ తో పాటుగా ఆయన డైలాగ్స్ కూడా తెగ వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాలో స్టార్ హీరోయిన్స్ నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అయితే, ఈ సినిమా కోసం నిధి అగర్వాల్ ఓ కొత్త స్టెప్ వేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా టీజర్ కోసం నిధి అగర్వాల్ తన పాత్రకు ఆమె స్వయంగా డబ్బింగ్ చెప్పుకుందట. దీంతో ఆమె క్యారెక్టర్ ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుంటుందో తనకు క్లారిటీ ఉందని నిధి కాన్ఫిడెంట్ గా చెబుతుంది. ఇక ఈ సినిమాలో ప్రభాస్ రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న రోల్స్ లో యాక్ట్ చేస్తుండగా.. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి.విశ్వప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# శేఖర్ కమ్ములకు కుబేర బిగ్ టెస్ట్ అవ్వనుందా?


సెన్సిబుల్ సినిమాల డైరెక్టర్ గా శేఖర్ కమ్ములకు మంచి ఫేమ్ ఉంది. ఆయన ప్రజంట్ కోలీవుడ్ స్టార్ ధనుష్ హీరోగా ఆయన తెరకెక్కించిన మూవీ కుబేర. నాగార్జున కీ రోల్ ప్లే చేసిన ఈ మూవీలో హీరోయిన్ గా రష్మిక మందన్న యాక్ట్ చేశారు. ఓ బిచ్చగాడికి, అపర కుబేరుడికి మధ్య సాగే ఆసక్తికరమైన కథతో శేఖర్ కమ్ముల ఈ మూవీని ప్లాన్ చేశారు. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. బిజినెస్ పరంగానూ రిలీజ్ కు ముందే మంచి లాభాల్ని దక్కించుకుంది. కంటెంట్ మెయిన్ గా సాగే ఈ సినిమా ప్రేక్షకుల్ని తప్పకుండా ఆకట్టుకుంటుందని రీసెంట్ గా విడుదల చేసిన ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ మూవీని మరో నాలుగు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. డాటర్ డ్రీమ్స్ నుంచి ఇంత వరకు శేఖర్ కమ్ముల చేసిన సినిమాలన్నీ ఫీల్ గుడ్ మూవీసే. లవ్ స్టోరీ సినిమా వరకు శేఖర్ కమ్ముల చేసిన సినిమాలన్నీ బడ్జెట్ ఫ్రెండ్లీ మూవీస్ అనే చెప్పాలి. ఫిదాని రూ.13 కోట్లతో తీసిన శేఖర్ కమ్ముల లవ్ స్టోరీకి మాత్రం తన స్టైల్ కు భిన్నంగా రూ.30 కోట్ల వరకు ఖర్చు పెట్టించారని వార్తలు వినిపించాయి. అయితే కుబేర మాత్రం అలా కాదు. శేఖర్ కమ్ముల బడ్జెట్ స్కూల్ కు డిఫరెంట్ గా భారీ బడ్జెట్‌తో ఈ మూవీని చేశారు. కమర్షియల్ బ్లాక్ బస్టర్లకు ఈక్వల్ గా హిట్ లని దక్కించుకుంటూ ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్‌లని రూపొందించి దర్శకుడిగా ప్రత్యేకతను చాటుకున్న శేఖర్ కమ్ముల ఈ సినిమాని మాత్రం తన స్టైల్ కు పూర్తి భిన్నంగా భారీ కమర్షియల్ సినిమాల తరహాలో ప్లాన్ చేశారు. ఈ సినిమా కోసం వంద కోట్లకు పైనే ఖర్చు చేశారని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. కొన్నేళ్ల క్రితం శేఖర్ కమ్ముల కహానీ మూవీని నయనతారతో అనామికగా రీమేక్ చేయడం తెలిసిందే. విమర్శలకు ప్రశంసలు దక్కించుకున్నా ఈ సినిమా కమర్షియల్‌గా మాత్రం సక్సెస్ అనిపించుకోలేకపోయింది. ఈ సినిమాతో తెలుగులో ప్రవేశించాలనుకున్న వయాకామ్ 18 సంస్థకు బిగ్ షాక్ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే శేఖర్ కమ్ముల ఫస్ట్ టైమ్ సాహసం చేసిన భారీ కమర్షియల్ ఎంటర్ టైనర్ కుబేర హాట్ టాపిక్ గా మారింది. ఫస్ట్ టైమ్ భారీ బడ్జెట్‌తో చేసిన ఈ సినిమా దర్శకుడిగా శేఖర్ కమ్ములకు బిగ్ టెస్ట్ అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను తెచ్చిపెడుతుందనేది చూడాలి.




# కన్నప్ప సినిమాపై రజనీకాంత్ రివ్యూ..

టాలీవుడ్ హీరో విష్ణు మంచు ప్రస్తుతం తన డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. కన్నప్ప సినిమాని జూన్ 27న రిలీజ్ చేయబోతోన్న సంగతి తెలిసిందే. లేటెస్ట్ గా ఈ సినిమాని రజనీకాంత్ చూశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంచు విష్ణు తాజాగా తన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెడుతూ.. రజనీకాంత్‌తో కలిసి దిగిన ఫొటోలను కూడా పోస్ట్ చేశారు. రజనీకాంత్ అంకుల్ కన్నప్ప సినిమాని చూశారు. సినిమా చూశాక ఆయన నన్ను ప్రేమగా హగ్ చేసుకున్నారు. తనకు కన్నప్ప సినిమా ఎంతగానో నచ్చిందని నాతో చెప్పారు. ఒక నటుడిగా ఈ క్షణం కోసం నేను 22 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నా. ఈ రోజు నాకెంతో సంతోషంగా ఉంది అంటూ మంచు విష్ణు చెప్పుకొచ్చారు. ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటి ఎంతోమంది స్టార్ కాస్ట్ కనిపించనున్న విషయం తెలిసిందే. పైగా మోహన్ బాబుతో పాటు కాజల్ అగర్వాల్, శరత్ కుమార్, మధుబాల, ముఖేష్ రిషి, కరుణాస్, యోగి బాబు, బ్రహ్మానందం, సప్తగిరి రఘు బాబు, ఐశ్వర్య రాజేష్, దేవరాజ్, మంచు విష్ణు కూతుళ్లు ఇలా భారీ తారగణంతో ఈ మూవీ తెరకెక్కుతోంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. నటుడు మోహన్ బాబు భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కన్నప్ప సినిమాను నిర్మించారు.






# గుజరాత్ లో నాగచైతన్య మూవీ షూటింగ్..

అక్కినేని ఫ్యామిలీ వారసుడు నాగచైతన్య హీరోగా కార్తీక్ వర్మ దండు డైరెక్షన్ లో ఓ మిస్టికల్ థ్రిల్లర్ తెర కెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇలాంటి థ్రిల్లర్ సినిమా చేయడం చైతన్యకు ఇదే ఫస్ట్ టైమ్. దీంతో నాగ చైతన్య రోల్ ఎలా ఉంటుంది? ఎలాంటి పెర్ఫార్మెన్స్ ఇస్తాడు? అన్న దానిపై మంచి ఇంట్రెస్ట్ అయితే క్రియేట్ అయ్యింది. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా కొన్ని భారీ సెట్లు వేసి షూటింగ్ చేస్తున్నారు. రీసెంట్ గా ఓ గుహ సెట్ లో కొన్ని ముఖ్యమైన సీన్స్ ని ప్లాన్ చేశారు. ఈ సీన్స్ సినిమాకు హైలైట్ గా నిలుస్తాయని కార్తీక్ ధీమా వ్యక్తం చేసాడు. విరూపాక్ష తర్వాత తెరకెక్కిస్తోన్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. విరూపాక్ష నుంచి మించిన థ్రిల్లర్ అంశాలు సినిమాలో ఉంటాయని ప్రేక్షుకులు ఆశిస్తున్నారు. లేటెస్ట్ గా ఈనెల లాస్ట్ వీక్ లో గుజరాత్ లో కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. నాగచైతన్యతో పాటు మెయిన్ కాస్ట్ పై కొన్ని ముఖ్యమైన సీన్స్ ని ప్లాన్ చేసినట్లుగా తెలుస్తుంది. అంతేకాకుండా ఈ కథకు గుజరాత్ లొకేషన్ కు ప్రత్యేకమైన సంబంధం ఉందట. స్టోరీ రాసే ముందు అక్కడ కొన్ని లోకేషన్లను పరిశీలించి స్క్రిప్ట్ లో యాడ్ చేశారట. ఈ నేపథ్యంలోనే అదే ప్రాంతమైన ఒరిజినల్ లొకేషన్ లోనే ఈ సీన్స్ షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ మొదలైన నాటి నుంచి ఇంత వరకూ ఔట్ డోర్ షూటింగ్ కి వెళ్లలేదు. షూటింగ్ అంతా హైదరాబాద్ లో నిర్మించిన సెట్లు...స్టూడియోల్లోనే నిర్వహించారు. ఫస్ట్ టైమ్ కీలక షెడ్యూల్ కోసం గుజరాత్ వెళ్తున్నారు. అక్కడ లొకేషన్లు ఏంటి? అన్నది వెళ్లేవరకూ క్లారిటీ రాదు. ఈ సినిమాలో నాగచైతన్య డిఫరెంట్ హెయిర్ స్టైల్లో ట్రై చేస్తున్నాడు. ఇప్పటికే లీక్ అయిన ప్రయివేట్ ఫోటోలను బట్టి చైతన్య లుక్ ఎలా ఉంటుందన్నది క్లారిటీ వస్తుంది. ఆ లుక్ లో చైతన్య మరింత స్మార్ట్ గా ఉన్నాడు. ఇక రీసెంట్ గా తండేల్ తో హిట్ అందుకున్న చైతన్య మంచి ఫామ్ లో ఉన్నారు. దీంతో ఈ మూవీపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి.